

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

తీన్మార్ మెల్కోల్పు

తీన్మార్ తెలుగు దిన పత్రిక

తలపెట్టిన మెల్కోల్పు కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు

రచనలు, కవితలు & వ్యాసాలు

-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-

teenmaardesk@gmail.com

ములుగు | సంపుటి: 04 | సంచిక: 269 | పేజీలు : 8 | ఆదివారం 5 ఏప్రిల్ 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad


## 6 గ్యారెంటీలు అమలు చేస్తే “రాజీనామా చేస్తా”



- రేవంత్ రెడ్డికి బండి సంజయ్ సవాల్
- కేరళ ఎన్నికల ప్రచారంపై విమర్శలు

2



## త్వరలో బోగస్ ఓట్ల తొలగింపు

- ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్
- సీఈవో సుదర్శన్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ బృందం
- నిష్పాక్షికంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని డిమాండ్

2




## ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

- జీవించే హక్కుకు భంగం కలిగించడమే..
- రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సీరియస్
- కలెక్టర్ సమగ్ర నివేదిక ఇవ్వాలి ఆదేశాలు



తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం ఎల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా శనివారం డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్ ఈ ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించింది. పాఠశాలలో నిల్వ ఉంచిన ఆహారం తిని ఆరుగురు విద్యార్థులతో పాటు ఒక ఉపాధ్యాయుడు అస్వస్థతకు గురై కాగజ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. దీనిపై ప్రాథమికంగా స్పందించిన కమిషన్.. ఇది ముమ్మాటికీ నిర్లక్ష్యమేనని, - మిగతా2లో



## ఇందిరమ్మ రాజ్యమా.. గూండా రాజ్యమా?


- పట్టపగలే బీహార్ గ్యాంగ్ తరహాలో దాడులా..!
- గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతోనేనన్న హరీష్ రావు



గజ్వేల్, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్)

గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి జరిగింది. కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడి చేశారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ముమ్మాటికీ ఇది సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై సీఎం చేయించిన దాడి అన్నారు. పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు - మిగతా2లో

## బాసర క్షేత్రానికి మహర్దశ




- రూ. 225 కోట్లతో పునర్నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- ఈ నెల 6న శంకుస్థాపన
- స్వయంగా వెళ్లనున్న ముఖ్యమంత్రి

హైదరాబాద్, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్)

చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ దేవాలయ పునర్నిర్మాణానికి తెలంగాణ సర్కార్ కీలక అడుగు వేసింది. ఈ మేరకు ఆలయ అభివృద్ధికి సంబంధించి శనివారం సీఎం రేవంత్ రెడ్డి దేవాదాయ శాఖ అధికారులతో సమావేశం అయ్యారు. ఈ భేటీలో సంబంధిత శాఖ మంత్రి కొండ సురేఖ పాల్గొన్నారు. - మిగతా2లో

## అవసరమైతే అసెంబ్లీ నక్సలైట్‌గా మారుతా



- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటుపై ఆగ్రహం
- ఇది కరోనా కంటే ప్రమాదకరం
- ప్రజలను ఇబ్బంది పెట్టకండి
- భావోద్వేగంగా కౌశిక్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ముఖ్యంగా తన నియోజకవర్గ ప్రజల ప్రయోజనాల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ప్రకటిస్తూ, అవసరమైతే తాను అసెంబ్లీ నక్సలైట్‌గా మారుతానని, అందుకు వెనుకాడబోనని స్పష్టం చేశారు. తన నియోజకవర్గంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. హుజూరాబాద్ ప్రజలు ఏం పాపం చేశారని అక్కడ డంపింగ్ యార్డ్ పెడుతున్నారని ప్రశ్నించిన ఆయన, ఇది కరోనా కంటే అత్యంత ప్రమాదకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తనపై ఉన్న వ్యక్తిగత కోపంతో ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని, కావాలంటే తనను మెట్రో పిల్లర్‌కు ఉరి వేయాలని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తనపై పెడుతున్న కేసులు, విచారణల పేరుతో కాలయాపన చేస్తోందని కౌశిక్ రెడ్డి విమర్శించారు. వచ్చే రెండేళ్ల పాటు తనను కేసులతో ఇబ్బంది పెట్టవచ్చుని, కానీ రెండేళ్ల తర్వాత కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారని, అప్పుడు ఇప్పుడు తనను వేధిస్తున్న కేసులే పోలీసుల మెడకు చుట్టుకుంటాయని హెచ్చరించారు. తన సొంత ఊరిలో దేవుడికి - మిగతా2లో

## సీఈఓలే లక్ష్యంగా కొత్త సైబర్ మోసం

**వాట్సాప్ వెబ్ ద్వారా కోట్లు కొల్లగొడుతున్న నేరగాళ్లు**

**హైదరాబాద్ సీపీ సజ్జనర్ హెచ్చరిక**



హైదరాబాద్, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):

వ్యాపార సంస్థల అధినేతలు, సీఈఓలు, సీఎఫ్ఓలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు సరికొత్త వాట్సాప్ మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ తెలిపారు. సంస్థల అధికారిక ఈమెయిల్స్‌కు హానికరమైన ఫిషింగ్ లింకులు పంపడం ద్వారా కంప్యూటర్లలోకి మాల్వేర్‌ను ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల సిస్టమ్స్‌పై నేరగాళ్లు పూర్తిస్థాయి రిమోట్ యాక్సెస్‌ను పొందుతూ అక్రమాలకు తెరలేపుతున్నారని చెప్పారు. - మిగతా2లో

## తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం



- హామీల అమలుపై అనుమానం ఉంటే తెలంగాణకు రండి
- లెక్కలతో సహా వివరిస్తా
- కేరళ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):

తెలంగాణలో ఎన్నికలకు ముందు మేము ఇచ్చిన హామీలలో దాదాపు అన్నింటిని అమలు చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మా హామీల అమలుపై ఎవరికైనా అనుమానం ఉంటే తెలంగాణకు వచ్చి అనుమానాలు నివృత్తి చేసుకోవాలని, ఆర్థిక మంత్రిగా లెక్కలతో సహా అన్ని వివరిస్తానని అన్నారు. శనివారం ఆయన కేరళ రాష్ట్రంలోని పతనం తిట్ట అసెంబ్లీ నియోజకవర్గం తో పాటు - మిగతా2లో

## తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

-మొదటిపేజీ తరువాయి
పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల ముందు లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని డిప్యూటీ సీఎం ఆరోపించారు. కేరళ రాష్ట్రంలో మార్పు, సంక్షేమం కోసం, సుపరిపాలన, సెక్యులర్ పాలన కోసం ఈనెల 9న జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో యుడిఎఫ్ (యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్) బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు.

**కమ్యూనిజం కాదు గూండాయిజం:**
కేరళలో పరిపాలన దారుణంగా పడిపోయిందని శబరిమల ఆలయంలో కుంభకోణం జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నిరుద్యోగం భారీగా పెరిగిపోయిందని దీంతో పొట్ట చేత పట్టుకొని కేరళ యువత ప్రపంచం నలుమూలలకు వలస పోతుంటే ఇక్కడున్న సీనియర్ సిటిజన్స్ కు సరైన సంక్షేమం, ఆదరణ లేకుండా పోయిందన్నారు. కేరళ అంటే సెక్యులరిజం, ఉన్నత విద్యావంతులు, గొప్ప మానవీయ కోణం ఉంటుందని అంతా భావిస్తాం. కానీ ఈరోజు కేరళలో ఆ తరహా పరిస్థితులు కనిపించకుండా పోయాయని విమర్శించారు. కేరళ అంటే కమ్యూనిజం, మార్క్సిజం గురించి మాట్లాడుతారు కానీ అది నేడు పక్కకు పోయి గుండాయిజం మాత్రమే కనిపిస్తుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ వాదులు శాంతి కాముకులు, సుపరిపాలన, సెక్యులరిజాన్ని కోరుకుంటారని వివరించారు.

**కేరళ సీఎం ప్రకటించుకుంటున్నారు:**
తెలంగాణ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని ఇప్పటివరకు తెలంగాణ మహిళలు 10వేల కోట్ల ఉచిత ప్రయాణాలు చేసిన వారి తరపున రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లిస్తుందని భట్టి చెప్పారు. రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తు, రూ.500 కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యా వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. విద్యపైన ఎక్కువ ఖర్చు చేస్తున్నామని కేరళ సీఎం ప్రకటించుకుంటున్నారు. కానీ విద్యపై అత్యధికంగా ఖర్చు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ 25 ఎకరాల్లో 200 కోట్లతో ఒక్కొక్క పాఠశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నామన్నారు.

**వారికోసం ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ:**
కేరళలో యూడీఎఫ్ కూటమిని అధికారంలోకి వస్తే కాలేజీలకు వెళ్లే మహిళలకు నెలకు రూ.1000 చొప్పున అందజేస్తామని, స్వయం ఉపాధి కోసం యువతకు వడ్డీ లేకుండా రూ.ఐదు లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. సామాజిక పెన్షన్?ను రెండువేల నుంచి మూడు వేలకు పెంపు, ఉమెన్ చాందీ పేరిట వృద్ధుల కోసం 25 లక్షల బీమా పథకాన్ని తీసుకురాబోతున్నామని చెప్పారు. యూడీఎఫ్ అధికారంలోకి రాగానే సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి వారి సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు.

## ఓటేసేందుకు వేతనంతో కూడిన సెలవు

**తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం**

**అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కార్మిక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు**

**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగే ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు ఆయా రాష్ట్రాలకు చెందిన వారై ఉండి తెలంగాణలో నివసిస్తున్న ఓటర్ల కోసం ప్రత్యేక సెలవులను ప్రకటించింది. ఈ మేరకు కార్మిక, ఉపాధి శాఖ అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. ఎన్నికలు జరుగుతున్న అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ఓటర్లు ఎవరైతే తెలంగాణలో ఉద్యోగ రీత్యా లేదా ఇతర పనుల నిమిత్తం స్థిరపడ్డారో వారందరికీ తమ సొంత రాష్ట్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఈ వెసులుబాటు కల్పించబడింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ సెలవు కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగాలకు కూడా వర్తిస్తుంది. రాష్ట్రంలోని అన్ని రకాల ఫ్యాక్టరీలు, వాణిజ్య సంస్థలు, దుకాణాలు, ఇతర సంస్థలలో పనిచేస్తున్న అర్హులైన కార్మికులకు, ఉద్యోగులకు పోలింగ్ రోజున పెయిడ్ హాలిడే ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఓటు వేయడానికి వెళ్లే ఉద్యోగుల జీతంలో ఎటువంటి కోత విధించకూడదని యాజమాన్యాలకు సూచనలు జారీ అయ్యాయి. అసోం, కేరళ మరియు పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన ఓటర్ల కోసం ఏప్రిల్ 9వ తేదీన సెలవు ప్రకటించారు. తమిళనాడు ఓటర్ల కోసం ఏప్రిల్ 23వ తేదీన ప్రత్యేక సెలవు వర్తించనుంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో వివిధ దశల్లో ఎన్నికలు జరుగుతున్నందున, అక్కడి ఓటర్ల కోసం ఏప్రిల్ 23 మరియు ఏప్రిల్ 29 తేదీల్లో సెలవులను కేటాయించారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాథమిక హక్కు అయిన ఓటును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారు సుదూర ప్రాంతాలకు ప్రయాణించి ఓటు వేయడానికి తగిన సమయం కల్పించడమే ఈ ఉత్తర్వుల ప్రధాన ఉద్దేశం. ఈ నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని కూడా అధికారులు హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను గుర్తించి, ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం కోరుతోంది.

## 28 జిల్లాలతో ఏపీ నూతన మ్యాప్

**రాజధానిగా అమరావతికి ప్రత్యేక గుర్తింపు**

**ప్రత్యేక బౌండరీలు లేకుండానే నూతన మ్యాప్**

**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా రాష్ట్ర నూతన మ్యాప్‌ను విపత్తు నిర్వహణ శాఖ విడుదల చేసింది. మొత్తం 28 జిల్లాలతో కూడిన ఈ అధికారిక మ్యాప్‌ను ఈ నెల 2వ తేదీన ప్రచురించారు. ఇందులో అత్యంత కీలకమైన అంశం ఏంటంటే రాజధాని అమరావతి ప్రస్తావన, కొత్తగా ఏర్పడిన జిల్లాల సరిహద్దులను స్పష్టంగా పొందుపరిచారు.

**అమరావతికి రాజధానిగా ప్రత్యేక గుర్తింపు**
ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలెట్ చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని రాష్ట్ర రాజధాని గా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. అయితే అమరావతికి ప్రత్యేక బౌండరీలను కేటాయించకుండానే, ఆ ప్రాంతాన్ని రాజధానిగా గుర్తించడం గమనార్హం. ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలైట్ చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని.. రాష్ట్ర రాజధానిగా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేసేందుకు గతంలో ఉన్న 26 జిల్లాలకు అదనంగా ఇటీవల మార్కాపురం, పోలవరం అనే రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండు జిల్లాల సరిహద్దులను కూడా తాజా మ్యాప్‌లో తెలియజేశారు. దీంతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి చేరింది. రాష్ట్ర విపత్తు నిర్వాహణ శాఖ ఈ మ్యాప్‌ను విడుదల చేయడం వెనుక ప్రధాన ఉద్దేశం ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు లేదా అత్యవసర పరిస్థితుల్లో జిల్లాల వారీగా సహాయక చర్యలు చేపట్టడానికి స్పష్టమైన భౌగోళిక సమాచారం ఉండటమే. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత సరిహద్దుల విషయంలో ఉన్న సందిగ్ధతను ఈ మ్యాప్ తొలగించనుంది.

## అవసరమైతే అసెంబ్లీ నక్సలైట్‌గా మారుతా

-మొదటిపేజీ తరువాయి
మొక్కుకోవడానికి వెళ్తున్న తనను అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తాను ఏదైనా తప్పు చేసినట్లు నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. ప్రజా పోరాటంలో భాగంగా అసెంబ్లీ వేదికగా గొంతు వినిపిస్తానని, అందుకు అసెంబ్లీ నక్సలైట్ గా మారడానికైనా సిద్ధమని ఆయన పునరుద్ఘాటించారు.

## ఇందిరమ్మ రాజ్యమా.. గూండా రాజ్యమా?

-మొదటిపేజీ తరువాయి
బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తోందన్నారు. ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా లేనట్లా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులపై దాడులు, ప్రజా సంఘాలపై దాడులు, మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా? ఎందుకు అడ్డుకోవడం లేదు? అని ప్రశ్నించారు. ఒకవైపు హేట్ స్పీచ్ బిల్ పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజా పాలన? ఇందిరమ్మ రాజ్యం అని చెబుతూ గూండా రాజ్యం అమలు చేస్తారా? సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ పాలనను గాలికి వదిలేసారా? ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే ఇక్కడ పాలనను ఎవరు చూస్తారు? బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని సందేశాలు ఇచ్చారా? కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా? ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి ఇప్పుడు, ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నారు. మీ అణచివేతలకు, మీ నిర్బంధాలకు, మీ దాడులకు బిఆర్ఎస్ పార్టీ అదరదు బెదరదు. ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటం, ప్రజల తరఫున పోరాటం చేస్తూనే ఉంటాం. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై దాడులు జరిపిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర డీజీపీని డిమాండ్ చేస్తున్నాం. ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుంది. తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరిస్తున్నాం అని హరీష్ రావు వ్యాఖ్యానించారు.

## తీవ్రవాద శక్తులకు వామపక్షాలు, కాంగ్రెస్ మద్దతు

**ప్రధాని మోడీ ఆరోపణలతో ధ్వజం**

**ఎన్డీయే అధికారంలోకి వస్తేనే కేరళ సమగ్ర అభివృద్ధి**

**న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):**



బ్యాంకును కాపాడుకోవడానికి వాపక్షాలు, కాంగ్రెస్ తీవ్రవాద శక్తులకు మద్దతు ఇస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ ధ్వజమెత్తారు. కేరళలో మునబం వంటి సంఘటనలు అంతకంతకూ పెరిగిపోతున్నాయని అక్కడ వందలాది హిందూ, క్రైస్తవ కుటుంబాలను బెదిరించారని ఆరోపించారు. బాధితులకు సహాయం చేయడానికి బదులుగా కేరళ ప్రభుత్వం తీవ్రవాద శక్తులకు మద్దతుగా నిలుస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. ఇవన్నీ గమనించిన కేరళంలోని దేశభక్తి కలిగిన ప్రజలు దీనిని ఎప్పటికీ జరగనివ్వరన్నారు. శనివారం కేరళంలోని తురువల్లలో ఎన్నికల ప్రచారంలోమాట్లాడిన మోడీ మునంబంలోని 404 ఎకరాల భూమి తమదేనంటూ వక్ఫ్ బోర్డు చేస్తున్న వాదనల వల్ల దాదాపు 600 కుటుంబాలు (మెజారిటీ క్రైస్తవులు) నిరాశ్రయులయ్యే పరిస్థితి వచ్చిందని ఆయన గుర్తుచేశారు.

**ఈశాన్య రాష్ట్రాల ఉదాహరణ:**
క్రైస్తవులు అధికంగా ఉండే ఈశాన్య రాష్ట్రాల్లోని 7 రాష్ట్రాల్లో ఎన్డీయే అధికారంలో ఉందని గత 50–60 ఏళ్లలో జరగని అభివృద్ధిని తాము అక్కడ చేసి చూపించామని మోడీ పేర్కొన్నారు. గోవాలో క్రైస్తవ సమాజం నిర్ణయాత్మక శక్తిగా ఉందని అక్కడ కూడా ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కేరళలో కూడా ఎన్డీయే ప్రభుత్వం వస్తే రాష్ట్రం అభివృద్ధిలో కొత్త శిఖరాలను తాకుతుందని హామీ ఇచ్చారు. కేరళలో రోడ్లు, వంతెనలు, మెడికల్ కాలేజీల పరిస్థితి దారుణంగా ఉందని, గత ప్రభుత్వాలు ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు.

## ఓటర్లకు అందుబాటులో “అభ్యర్థుల నేర చరిత్ర”

**ఈసీఐనెట్ ద్వారా అభ్యర్థుల పూర్తి వివరాలు**

**ప్రకటన విడుదల చేసిన ఎన్నికల సంఘం**

**న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):**




ఓటర్లు తమ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థుల విద్యా అర్హతలు, నేర చరిత్ర వివరాలను ఈసీఐనెట్ ప్లాట్‌ఫామ్ ద్వారా తెలుసుకోవచ్చని ఎన్నికల సంఘం తెలిపింది. అభ్యర్థులు సమర్పించిన పూర్తి అఫిడవిట్‌ను కూడా ఓటర్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈసీఐనెట్ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల సేవల వేదిక. ఇది ఎన్నికల సంఘానికి చెందిన 40కి పైగా యాప్‌లు, పోర్టల్‌లను అనుసంధానించి, అన్ని ఎన్నికల సేవలను ఒకే చోట సజావుగా అందిస్తుంది. అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు మరియు పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఏప్రిల్ 9న పోలింగ్ జరగనున్న అస్సాం, కేరళ, పుదుచ్చేరి శాసనసభల ఎన్నికలు మరియు నాలుగు రాష్ట్రాల్లోని ఉప ఎన్నికల కోసం మొత్తం 1,955 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నేర కేసులు, ఆస్తులు, అప్పులు మరియు విద్యా అర్హతల గురించిన సమాచారాన్ని పొందడానికి పౌరులు ఈసీఐనెట్ యొక్క ‘మీ అభ్యర్థులను తెలుసుకోండి’ మాడ్యూల్‌ను ఉపయోగించుకోవచ్చని కమిషన్ తెలిపింది.

## రాష్ట్ర సంపదను కొల్లగొడుతున్న సీఎం

**ఎన్నికల కోసం రాష్ట్ర ప్రజల సంపద తరలింపు**

**ఎంపీ ఈటల సంచలన ఆరోపణలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరు గ్యారెంటీలు, ఫీజురీయింబర్స్‌మెంట్ సహా పలు అంశాలపై సీఎంకు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ప్రజల సంపదను రేవంత్ రెడ్డి కొల్లగొడుతున్నారని ఈటల రాజేందర్ ఆరోపణలు గుప్పించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం రాష్ట్ర ప్రజల సంపదను తరలిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఎన్నికల వేళ ఆరు గ్యారంటీలు– 66 హామీల పేరుతో ప్రజలను ఆయన మోసం చేశారని ఎంపీ ఈటల ఆగ్రహించారు. రాష్ట్ర ప్రజానీకం గంపెడు ఆశలతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే చట్ట సభల్లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వ్యక్తిగత దూషణలతో కాలం వృథా చేశారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటం ఆడుతోందని ఆగ్రహించారు ఈటల. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు ఎలా సాధ్యమవుతుందని ఎన్నికల వేళ అగినప్పుడు తాను చేసి చూపిస్తానని రేవంత్ ప్రగల్భాలు పలికారని చెప్పారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండానే చేసినట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. వేల కోట్ల విలువ చేసే భూములను ప్రైవేట్ వ్యక్తులతో కలిసి సీఎం రేవంత్ అమ్ముకుంటున్నారంటూ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు.

## ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

-మొదటిపేజీ తరువాయి
ఆర్టికల్ 21 కల్పించిన జీవించే హక్కు, ఆరోగ్యానికి భంగం కలిగించడమేనని స్పష్టం చేసింది. దీనిపై తక్షణమే స్పందించి, ఏప్రిల్ 27 లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది.

## 6 గ్యారెంటీలు అమలు చేస్తే “రాజీనామా చేస్తా”

కరీంనగర్, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో 6 గ్యారెంటీలు అమలు చేస్తే నేను నా పదవికి రాజీనామా చేస్తానని ఒకవేళ అమలు కాకపోతే రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా? అని ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. కేరళం ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు మాట్లాడున్నారుని ఇలాంటి అబద్దాల వల్లే గతంలో బీహార్, హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిందని ఎద్దేవా చేశారు. శనివారం కరీంనగర్ లో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్ తెలంగాణలోని ఏ గ్రామానికైనా కేరళం మీడియాను తీసుకెళ్దా మని నా సవాల్?ను సీఎం రేవంత్ష్ట్ర రెడ్డి స్వీకరించాలన్నారు.

**వత్తాసు పలకడం సిగ్గు చేటు**
ఖానాపూర్ మున్సిపాలిటీ చైర్మన్?గా బీజేపీ అభ్యర్థిని తక్షణమే ప్రకటించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బీజేపీకి సంపూర్ణ మద్దతు ఉన్న ఖానాపూర్ చైర్మన్ అభ్యర్థిని ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల అధికారులు అధికార కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలకడం సిగ్గు చేటని దుయ్యబట్టారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న ఎన్నికల అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

## త్వరలో బోగస్ ఓట్ల తొలగింపు

**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):**
తెలంగాణలో త్వరలో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ ప్రక్రియలో రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో బోగస్ ఓట్ల తొలగింపు, కొత్త ఓట్ల నమోదు, ఓటరు వివరాల సవరణ చేపడతారు. ఈ ప్రక్రియలో బీఎల్‌ఏ క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. అయితే ఈ బీఎల్‌ఏల నియామకం పారదర్శకంగా జరగడం లేదని బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని కలిశారు. సర్ జరిగే 86 నియోజకవర్గాల్లో బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం పారదర్శకంగా జరిగేలా చూడాలని వారు సీఈవోకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం బూత్ స్థాయి ఏజెంట్ల నియామక అధికారాన్ని ఆయా నియోజకవర్గాల్లో అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఇచ్చారని, ఒకవేళ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జులకు ఆ అధికారం అప్పగించారని ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో బీఎల్‌ఏ నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, నిబంధనల ప్రకారం నియామకాలు జరిగేలా చూడాలని వారు సీఈవోను కోరారు. ఓటర్ల జాబితా సవరణలో ఎటువంటి పొరపాట్లు జరగకూడదని, అర్హులైన ఒక్క ఓటరును కూడా జాబితా నుండి తొలగించవద్దని వారు స్పష్టం చేశారు. బూత్ స్థాయి ఏజెంట్లు సమర్థవంతంగా విధులు నిర్వహించేలా వారికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షిక వాతావరణంలో జరిగేలా చూడటంలో ఎన్నికల సంఘం చొరవ చూపాలని బీఆర్ఎస్ బృందం కోరింది.

## బాసర క్షేత్రానికి మహర్దశ

-మొదటిపేజీ తరువాయి
సమావేశంలో భాగంగా బాసర ఆలయ సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. ఈ ప్లాన్‌ను పరిశీలించిన రేవంత్ రెడ్డి, భక్తుల సౌకర్యార్థం, ఆలయ పవిత్రతను కాపాడేలా పలు కీలక మార్పులు సూచించారు.

**రూ.225 కోట్లతో భారీ అభివృద్ధి పనులు**
మొత్తం రూ.225 కోట్ల వ్యయంతో బాసర క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు. ఈ నెల 6న సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా బాసరకు వెళ్లి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, సంప్రదాయబద్ధంగా, ఆగమ శాస్త్రం ప్రకారమే ఆలయ పునర్నిర్మాణం జరగాలని సీఎం స్పష్టం చేశారు. భవిష్యత్తు అవసరాలను, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లో విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆలయ పవిత్రతను, పర్యావరణాన్ని కాపాడడంలో భాగంగా ఆలయ పరిసరాల్లో కేవలం ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే అనుమతించాలని సూచించారు.

**భక్తులకు ప్రపంచ స్థాయి వసతులు**
తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే బాసర ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా కఠినమైన నిబంధనలు రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఆలయ పవిత్రతకు భంగం కలిగించే ఏ చర్యలనైనా అడ్డుకునేలా నిబంధనలను కఠినతరం చేయాలని పేర్కొన్నారు. అక్షరాభ్యాసం కోసం వచ్చే వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, వసతి గృహాలు, గోదావరి స్నాన ఘట్టాలను ఆధునీకరించనున్నారు. బాసర క్షేత్రం అద్భుతంగా ఉండేలా ప్రతి అడుగులోనూ నాణ్యత పాటించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## సీఈఓలే లక్ష్యంగా కొత్త సైబర్ మోసం



-మొదటిపేజీ తరువాయి
ఈ మేరకు వివరాలు వెల్లడిస్తూ ఓ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. సిస్టమ్ నియంత్రణలోకి వచ్చిన తర్వాత అందులో యాక్టివ్‌గా ఉన్న వాట్సాప్ వెబ్ సెషన్లను నేరగాళ్లు చాకచక్యంగా వినియోగిస్తున్నారని సీపీ తెలిపారు. సీఈఓ లేదా సీఎఫ్ఓల పేరుతో అకౌంటెంట్లకు తప్పుదారి పట్టించే సందేశాలను పంపిస్తూ నమ్మిస్తున్నారని వెల్లడించారు. తాము అత్యవసర సమావేశంలో ఉన్నామని, ఫోన్ ఎత్తడం వీలుపడదని చెబుతూ కోట్లాది రూపాయలు కాజేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాలతో తక్షణమే తమ ఖాతాలకు డబ్బును బదిలీ చేయించుకుంటున్నారని చెప్పారు. పై అధికారుల నంబర్ల నుంచే సందేశాలు వస్తుండటంతో అకౌంటెంట్లు కూడా నిజమేనని నమ్మి మోసపోతున్నారని అన్నారు. ఇటీవల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ప్రతి కంపెనీ కూడా ఇటువంటి సైబర్ దాడుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్‌లో అధికారుల పేరుతో వచ్చే ఆర్థిక అభ్యర్థనలను గుడ్డిగా నమ్మకూడదని పేర్కొన్నారు. వెంటనే అధికారులకు నేరుగా ఫోన్ చేసి ఆ సందేశం నిజమేనా కాదా అని ధృవీకరించుకోవాలని చెప్పారు. ఆఫీసు సిస్టమ్స్‌లో నాణ్యమైన ఫైర్‌వాల్స్, యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లను నిరంతరం అప్‌డేట్ చేసి ఉంచాలని అన్నారు. వాట్సాప్ వెబ్ వాడిన ప్రతిసారి తప్పకుండా లాగౌట్ చేయడం మర్చిపోవద్దని తెలిపారు. సాంకేతిక భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారానే ఇటువంటి దాడులను ఎదుర్కోగలమని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని సజ్జనర్ చెప్పారు. అలాగే బాధితులు ష్ట్రజూం://ఞఎఎవతీఞతీఱఎవ. స్త్రశీజ.ఱఅ పోర్టల్‌లో తమ ఫిర్యాదును వెంటనే నమోదు చేయాలని అన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్త వహించాలని వివరించారు.

# కేరళలో వచ్చేది ఎన్‌డీఏ ప్రభుత్వమే

కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ నిష్క్రమణకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎన్నికల తర్వాత కేరళలో అతిపెద్ద మార్పు జరుగుతుందని, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పతనంతిట్ట జిల్లాలోని తిరువళ్లలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. కేరళ అభివృద్ధికి అవినీతి, మతతత్వం రెండు అతిపెద్ద అవరోధాలని ఈ సందర్భంగా చెప్పారు. శబరి రైలు ప్రాజెక్టును ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఆలస్యం చేయడంతో తిరువళ్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ప్రధాని ఆరోపించారు. కేరళకు అపారమైన సామర్థ్యం ఉన్నప్పటికీ, అభివృద్ధి పరుగులో ఇతర రాష్ట్రాల కంటే వెనుకబడి ఉందని పేర్కొన్నారు. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ ప్రభుత్వాలు సరైన శ్రద్ధ చూపకపోవడం వల్ల కేరళ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు అధ్వాన్నంగా ఉన్నాయని మోదీ ఆరోపించారు. కేరళలో బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులు తొలగిపోతాయని చెప్పారు. పశ్చిమాసియాలో పరిస్థితిపై కాంగ్రెస్ అనవసర ఆందోళనలు రేకెత్తిస్తోందని ప్రధాని విమర్శించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కంటే ఎన్?డీఏ ప్రభుత్వం కేరళ అభివృద్ధి కోసం ఐదు రెట్లు అధికంగా నిధులు ఖర్చు చేసిందని వివరించారు.

"నేను ఇంతకు ముందు కూడా ఇక్కడికి వచ్చాను. కానీ ఈసారి మార్పు గాలులు మరో దిశలో వీస్తున్నాయి. కేరళ ప్రజల మూడ్ మారినట్టు కనిపిస్తోంది. కేరళలో అతిపెద్ద మార్పు జరగబోతోంది. ఏప్రిల్ 9న పోలింగ్ జరుగుతుంది. మే 4న దశాబ్దాల దుష్పరిపాలన అంతం కానుంది. ఎల్డీఎఫ్



ప్రభుత్వ నిష్క్రమణకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. కేరళలో మొదటిసారిగా బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాబోతోంది."

### కాంగ్రెస్ రెచ్చగొట్టే వ్యాఖ్యలతో– కేరళ ప్రజల ప్రాణాలకు ముప్పు

తనను రాజకీయంగా దెబ్బతీయడం కోసం, పశ్చిమాసియా దేశాలతో భారత్?కు ఉన్న సంబంధాలను చెడగొట్టేలా కాంగ్రెస్ రెచ్చగొట్టే వ్యాఖ్యల చేస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు కేవలం ఎన్నికల్లో గెలవడం తప్ప మరో ధ్యాస ఉందని విమర్శించారు. "నేను ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలని అనుకుంటున్నాను. ఎన్నికలు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ భారతీయుల రక్షణ, ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉన్న కేరళ ప్రజల భద్రత మా ప్రథమ ప్రాధాన్యత. వారిని రక్షించే బాధ్యతను నేను తీసుకుంటాను" అని ఎన్?డీఏ ర్యాలీలో ఆయన పేర్కొన్నారు. "గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న లక్షలాది మంది కేరళ ప్రజలతోపాటు, యుద్ధం కారణంగా ఇరాన్ సహా ఇతర ప్రాంతాల్లో చిక్కుకుపోయిన గోవా, తమిళనాడు సహా ఇతర రాష్ట్రాల మత్స్యకారుల గురించి కూడా మోదీ ప్రస్తావించారు. మేము వారందరినీ సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. కానీ కాంగ్రెస్? పార్టీకి దీని గురించి పట్టదు. పశ్చిమాసియా దేశాలతో భారత సంబంధాలు దెబ్బతీసేలా, అనవసర భయాందోళనలను సృష్టించేలా కాంగ్రెస్ ప్రకటనలు చేస్తోంది. ఇదంతా కేవలం నాపై రాజకీయ దాడులు చేయడానికే. వారికి కేవలం రాజకీయం, అధికారం మీదే కాంక్ష ఉంది. భారత ప్రజల పట్ల వారికి ఎలాంటి పట్టింపు లేదు. వాళ్లు కేరళ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారు. దీనికి వాళ్లు కేరళ ప్రజలకు, దేశానికి క్షమాపణ చెప్పాలి" అని మోదీ పేర్కొన్నారు.

ఇంతకుముందు వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ, ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ ఆయన పిరికివాడు అని విమర్శించారు. తనను తాను రక్షించుకునేందుకు ఆయన అమెరికా, ఇజ్రాయెల్ ముందు తలవంచారని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే మోదీ కాంగ్రెస్?పై విరుచుకుపడ్డారు. "లక్షలాది మంది కేరళవాసులు పశ్చిమాసియాలో పనిచేస్తున్నారు. అయినా కాంగ్రెస్ నేతలు బాధ్యతారాహిత్యంగా ప్రకటనలు చేస్తూ, వారి భద్రతను ప్రమాదంలో పడేస్తున్నారు. పశ్చిమాసియాలో నివసిస్తున్న భారతీయులను ప్రమాదంలోకి నెట్టే వ్యాఖ్యలు చేయవద్దని నేను కాంగ్రెస్? నేతలను కోరుతున్నాను. గల్ఫ్ దేశాలతో మా ప్రభుత్వానికి ఉన్న బలమైన సంబంధాలే ఈ కష్టకాలంలో మన ప్రజలను రక్షించడానికి సహాయపడుతున్నాయి" అని అన్నారు.

## పుదుచ్చేరికి రాష్ట్ర హోదా



పుదుచ్చేరికి పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను సాధించడానికి నూటికి నూరు శాతం కృషి చేస్తామని టీవీకే అధినేత విజయ్ హామీ ఇచ్చారు. కేంద్రంలో దశాబ్దాలుగా అధికారంలో ఉన్నప్పటికీ, కాంగ్రెస్, బీజేపీలు పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించలేదని విజయ్ గుర్తు చేశారు. పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నిర్వహించిన విజయ్, డీఎంకే–కాంగ్రెస్ కూటమిపై విమర్శలు గుప్పించారు. తమిళనాడు మాదిరిగానే పుదుచ్చేరిలోనూ అది ఒక గందరగోళ కూటమిగా మారిందంటూ ఎద్దేవా చేశారు. టీవీకే అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పుదుచ్చేరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని విజయ్ వాగ్దానం చేశారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతీ కుటుంబానికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ కుటుంబానికి 25లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని వివరించారు. పుదుచ్చేరి యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ ఆర్ట్సను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## ఇరాన్‌తో చెల్లింపు సమస్యలేవీ లేవు



ముడి చమురు దిగుమతుల విషయంలో ఇరాన్‌తో ఎలాంటి చెల్లింపు సమస్యలూ లేవని భారత పెట్రోలియం, సహజ వాయువు శాఖ స్పష్టం చేసింది. భారతీయ చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) ఇరాన్ సహా విదేశీ సప్లయర్ల నుంచి నిరంతరాయంగా ముడి చమురును కొంటున్నాయని వెల్లడించింది. రాబోయే కొన్ని నెలల అవసరాలకు సరిపడా ముడి చమురు సప్లైలను భారత్ ఇప్పటికే నిర్ధరించుకుందని తెలిపింది. ఈమేరకు పెట్రోలియం, సహజ వాయువు శాఖ శనివారం ఒక ట్వీట్ చేసింది. ఇరాన్‌తో భారత్‌కు చెల్లింపు సమస్యలు తలెత్తాయంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అబద్ధమని స్పష్టం చేసింది.

### చెల్లింపు సమస్య వల్లే నౌక దారి మళ్లించారనే వార్త అవాస్తవం

ఇరాన్ చమురుతో భారత్‌లోని వాదినార్ (గుజరాత్) వైపు వస్తున్న ట్యాంకరును, మార్గం మధ్యలోనే చైనాకు దారి మళ్లించినట్టుగా జరుగుతున్న ప్రచారాన్ని భారత పెట్రోలియం శాఖ ఖండించింది. భారత్‌కు వచ్చిన చమురు ట్యాంకర్ మరో దేశానికి (చైనాకు) డైవర్ట్ చేయడం గత ఏడేళ్లలో ఇదే తొలిసారి అని, చెల్లింపు సమస్య వల్లే ఈవిధంగా జరిగిందనే ప్రచారం పూర్తి అవాస్తవమని తేల్చి చెప్పింది. వాణిజ్యపరమైన ప్రయోజనం, నిర్వహణపరమైన సౌలభ్యం ప్రాతిపదికన చమురు పరిశ్రమలు అనుసరించే ప్రమాణాలను పట్టించుకోకుండా ఈ ప్రచారం చేశారని భారత్ విమర్శించింది. ఇరాన్‌కు చెల్లింపులు చేసే విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి అవాంతరాలూ లేవని పేర్కొంది.

### చమురు నౌకల గమ్యస్థానాల్లో మార్పులు సర్వసాధారణం

"ఇరాన్ సహా 40కిపైగా దేశాల నుంచి భారత్ ముడి చమురును కొనుగోలు చేస్తోంది. భారత్‌లోని రిఫైనరీలు వాణిజ్య అంశాలను ప్రాతిపదికగా తీసుకొని పూర్తి సౌలభ్యంతో విదేశాల నుంచి చమురును కొంటున్నాయి. చమురు నౌకల గమ్యస్థానాల్లో మార్పులు జరగడం అనేది సర్వసాధారణ విషయం. నిర్వహణపరమైన, వాణిజ్యపరమైన కారణాలతో కొన్నిసార్లు చమురు నౌకల బిల్ ఆఫ్ లేడింగ్‌లో తాత్కాలిక పోర్టుల వివరాలను పొందుపరుస్తారు. అయితే వాణిజ్య ప్రయోజనం, నిర్వహణ సౌలభ్యాలను బట్టి ఆయా నౌకలను మార్గంమధ్యలోనే మరోచోటుకు మళ్లిస్తుంటారు. ముడి చమురు వాణిజ్యం ఎలా జరుగుతుందనే అంశాన్ని పక్కన పెట్టి ఓ చమురు నౌకపై వదంతులను వ్యాప్తి చేశారు. ఇరాన్ నుంచి 44వేల టన్నుల ఎల్పీజీతో సీ బర్డ్ నౌక ఏప్రిల్ 2న మంగళూరుకు చేరుకుంది. ప్రస్తుతం దాని నుంచి ఎల్పీజీని డిశ్చార్జ్ చేసే ప్రక్రియ జరుగుతోంది" అని భారత పెట్రోలియం, సహజ వాయువు శాఖ వెల్లడించింది.

### 2019లో బంద్ : మళ్లీ ఇప్పుడు ఓపెన్

వాస్తవానికి భారత్, ఇరాన్‌ల చమురు వాణిజ్యానికి దశాబ్దాల చరిత్ర ఉంది. ఇరాన్ లైట్ క్రూడ్, ఇరాన్ హెవీ క్రూడ్ రకాల ముడి చమురును భారత్ ఎక్కువగా కొనుగోలుచేసేది. ఒకానొక దశలో భారతదేశ చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా 11.5 శాతం దాకా ఉండేది. 2018 నాటికి ఇరాన్ నుంచి ప్రతిరోజు 5.18 లక్షల బ్యారెళ్ల ముడి చమురును భారత్ కొనుగోలు చేసేది. కానీ 2018లో ఇరాన్‌పై అమెరికా కఠిన ఆంక్షలు అమల్లోకి వచ్చాక పరిస్థితులు మారాయి. 2019 మే నుంచి చమురు కోసం ఇరాన్‌కు భారత రిఫైనరీల ఆర్డర్లు ఆగిపోయాయి. దీంతో 2019 జనవరి– మే నాటికి ఇరాన్ నుంచి భారత్‌కు చమురు సప్లై ప్రతిరోజు 2.68 లక్షల బ్యారెళ్లకు తగ్గిపోయింది.

ఇరాన్‌కు బదులుగా పశ్చిమాసియాలోని గల్ఫ్ దేశాలు, అమెరికాకు చమురు ఆర్డర్లను భారత రిఫైనరీలు పెంచాయి. 2026 ఫిబ్రవరి 28న ఇరాన్, అమెరికా– ఇజ్రాయెల్ యుద్ధం మొదలయ్యాక యావత్ ప్రపంచంలో ఇంధన సంక్షోభం మొదలైంది. దీంతో గత నెలలోనే ఇరాన్ చమురుపై ఆంక్షలను అమెరికా తాత్కాలికంగా(30 రోజులు) ఎత్తేసింది. 2026 ఏప్రిల్ 19 వరకు ఇరాన్ నుంచి చమురు కొనే దేశాలపై ఎలాంటి ఆంక్షలూ ఉండవు. అందుకే ఇప్పుడు ఇరాన్ చమురునూ భారత రిఫైనరీలు కొంటున్నాయి. ఇరాన్ నుంచి 6 లక్షల బ్యారెళ్ల ముడిచమురుతో గుజరాత్‌లోని వదినార్‌కు బయలుదేరిన చైనా నౌక పింగ్ షన్‌ను మార్గం మధ్యలోనే చైనాకు డైవర్ట్ చేశారనే ప్రచారం జరిగింది. ఈ ప్రచారాన్ని భారత సర్కారు ఖండించింది.

# 'ధర్మదామ్'లో ఎన్నికల హీట్

కేరళం అసెంబ్లీ ఎన్నికల వేళ అందరి దృష్టి 'ధర్మదామ్' నియోజకవర్గంపైనే నెలకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ మూడోసారి ఇక్కడి నుంచి పోటీలో ఉండడమే ఇందుకు ప్రధాన కారణం. గతంలో 2016, 2021లో ఈ స్థానంలో పోటీ చేసి గెలిచిన ఆయన మూడోసారి విజయ ఢంకా మోగించి నయా చరిత్ర సృష్టించాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో ధర్మదామ్ విశేషం ఏంటి? విజయన్ ప్రత్యర్థులెవరు? ఎవరి అవకాశాలు ఎలా ఉన్నాయో చూద్దాం!

### వామపక్షాల కంచుకోట!

2008లో ధర్మదామ్ అసెంబ్లీ? నియోజకవర్గం ఏర్పడింది. ఇది కేరళలోని కన్నూర్ జిల్లాలో ఉంది. ఈ నియోజరవర్గంలో ఎనిమిది పంచాయతీలు ఉన్నాయి. 2011లో ఈ స్థానానికి తొలిసారి ఎన్నికలు జరగ్గా, అప్పుడు ఎల్‌డీఎఫ్ (లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్) అభ్యర్థి కేకే నారాయణన్ గెలుపొందారు. అప్పటి నుంచి ధర్మదామ్‌కు మూడుసార్లు ఎన్నికలు జరగ్గా మూడుసార్లు కూడా లెఫ్ట్ పార్టీనే విజయం సాధించింది. యూడీఎఫ్ (యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్) ఇక్కడ ఒక్కసారి కూడా నెగ్గలేకపోయింది. అలా గత 15ఏళ్లుగా ఈ నియోజకవర్గం? లెఫ్ట్ వింగ్?? పార్టీలకు కంచుకోటగా నిలుస్తోంది.

### హ్యాట్రిక్‌పై గురి!

2016లో విజయన్ ఈ స్థానంలో ఎల్?డీఎఫ్? తరపున తొలిసారి పోటీ చేశారు. అప్పుడు ?తన ప్రత్యర్థి మంబారమ్ దివాకరణ్ (కాంగ్రెస్)పై 36 వేలకు పైచిలుకు ఓట్ల మెజార్టీ సాధించి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నారు. ఇక రెండోసారి 2021లో పోటీ చేసిన విజయన్ బంపర్ మెజార్టీలో జయకేతనం ఎగురవేశారు. ఈసారి సీ రఘునాథ్ (కాంగ్రెస్)పై 50వేలకుపై మెజార్టీతో నెగ్గారు. ఇప్పుడు మరోసారి ఇక్కడ్నుంచే పోటీలో నిలిచిన ఆయన హ్యాట్రిక్?పై కన్నేశారు.

### సానుకూల అంశాలు

ఈ నియోజకవర్గం లెఫ్ట్ పార్టీలకు కంచుకోటగా ఉండడం ఎల్ఢీఎఫ్‌కు సానుకూలాంశం. అలాగే గత చరిత్ర వామపక్షాలకు అనుకూలంగా ఉండడం, విజయన్ స్వయంగా సీఎం అభ్యర్థి కావడం కూడా కలిసొచ్చేదే. ఇక గత పదేళ్లలో తమ ప్రభుత్వం చేసిన సంక్షేమం, ఇప్పుడు కొత్తగా



మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలే ప్రధానంగా అధికార ఎల్‌డీఎఫ్ ముందుకెళ్తోంది. ఇక దేశంలో సీపీఐ (మార్క్సిస్ట్)లో అత్యంత ప్రభావితమైన నాయకులలో ఒకరిగా పేరున్న విజయన్ పనితీరుకు ఈ నియోజకవర్గం ఫలితాన్ని ఒక కొలమానంగా రాజకీయ విశ్లేషకులు చూస్తున్నారు!

### ప్రత్యర్థుల ఆశలు!

సీఎం విజయన్?ను ఢీ కొట్టేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ నుంచి వీపీ అబ్దుల్ రషీద్ బరిలో నిలిచారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటింగ్, స్థానికంగా ఉన్న సమస్యలు, యువత నిరుద్యోగం అనే అంశాలపై ఆశలు పెట్టుకుంది. మరోవైపు, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌లడీఏ కే రంజిత్‌ను తమ అభ్యర్థిగా ఖరారు చేసింది. డబుల్ ఇంజిన్ సర్కార్ అనే నినాదాన్ని ఎన్‌డీఏ ముందుకు తీసుకువెళ్తోంది.

అయితే ధర్మదామ్ అనగానే ఎల్‌డీఎఫ్– యూడీఎఫ్? మధ్య పోటీనే ఉండేది. కానీ ఈసారి బీజేపీ రేస్?లోకి దూసుకొచ్చింది. ఇటీవల తిరువనంతపురం కార్పోరేషన్ ఎన్నికల్లో నెగ్గడం, 2024 లోక్?సభ ఎన్నికల్లో ఎన్?డీఏ తొలిసారి ఎంపీ సీటు కైవసం చేసుకోవడంతో బీజేబీ కూడా ఈ స్థానంపై ఆశలు పెట్టుకుంది. ఆ పార్టీ వరుసగా మూడు ఎన్నికల్లో ఓటు శాతం పెంచుకుంటూ వస్తోంది. ఈసారి ఎలాగైనా నెగ్గాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం జాతీయ స్థాయి నాయకులు ఇప్పటికే ప్రచారంలో పాల్గొంటున్నారు.

ఇక ఈసారి ఎలాగైనా ఎల్‌డీఎఫ్‌ను దెబ్బ కొట్టి ధర్మదామ్?లో తమకూ స్థానం ఉందని చూపించాలని యూడీఎఫ్ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఈ పరిణామాలు చూస్తుంటే, గతంలో కంటే పోటీ ఇప్పుడు భిన్నంగా ఉండనుందని అర్థమవుతోంది. ఇక్కడి నుంచి విజయన్ రెండుసార్లు ఈజీగా నెగ్గినప్పటికీ ఈసారి ఈసారి త్రిముఖ పోటీ ఉందనడంలో సందేహం లేదు. శబరిమల బంగారం అంశం, మైనారిటీల ఓటు బ్యాంక్ కీలకం కానుంది.

### మరిన్ని విశేషాలు

ఈ నియోజకవర్గంలో శాంతియుతంగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు ఎన్నికల సంఘం పటిష్ఠ ఏర్పాట్లు చేస్తోంది. ఈసీ ప్రకారం, ఈ నియోజకవర్గంలో మొత్తం 1,84,844 ఓటర్లు ఉన్నారు. ఇందులో అత్యధికంగా మహిళలు 99,179 మంది ఉండగా, పురుషులు 85,665 ఉన్నారు. 140 సీట్లు ఉన్న కేరళంలో ఈనెల 9న ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

# మైనారిటీలపై దాడి చేస్తున్న వారితో కేరళ సీఎం విజయన్‌కు సంబంధాలు

దేశంలోని ఇతర ప్రాంతాలలో మైనారిటీలపై దాడి చేసే వ్యక్తులతో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు సంబంధాలున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తన ఎన్నికల ప్రచారంలో శబరిమల అంశం గురించి ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడలేదని విమర్శించారు. బీజేపీ–ఎల్‌డీఎఫ్ మధ్య పొత్తు ఉందని అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎల్‌డీఎఫ్‌లో ఎవరూ ఉండరని పేర్కొన్నారు. సీపీఎం పార్టీ తన ప్రధాన సిద్ధాంతంపై రాజీ పడుతోందని విమర్శించారు. కేరళలోని అలప్పుజలో జరిగిన బహిరంగ సభలో ఈ మేరకు ఎల్‌డీఎఫ్, బీజేపీపై రాహుల్ మండిపడ్డారు.

### మేము విభేదించే భావజాలానికి అండగా లెఫ్ట్ ఫ్రంట్

అలాగే తనతో వేదిక పంచుకున్న మాజీ సిపీఎం నాయకుడు జి. సుధాకరన్ గురించి రాహుల్ గాంధీ ప్రస్తావించారు. "ఈ వేదికపై ఒక మాజీ సీనియర్ వామపక్ష నాయకుడు (సుధాకరన్‌ను ఉద్దేశించి) ఉన్నారు. ఆయన ఇక్కడ కూర్చోవడానికి ఒక కారణం ఉంది. ఆయన ఆలోచనలు అకస్మాత్తుగా మారిపోలేదు. ఒక రాజకీయ పార్టీలో చాలా ఏళ్లు పనిచేశారు. సుధాకరన్ అవకాశవాదంతో ఇక్కడికి కాలేదు. ఎల్‌డీఎఫ్‌లో ఏదో మార్పు జరగడం వల్లే ఇక్కడ ఉన్నారు. ఎల్‌డీఎఫ్ చాలా ఏళ్లుగా మాకు ప్రత్యర్థిగా ఉంది. మేము వారితో పోరాడాం. ఇకపైనా పోరాడుతూనే ఉంటాం. కానీ చాలా ఏళ్లుగా మేము విభేదించే కొన్ని భావజాలాలకు వారు అండగా నిలబడ్డారు. " అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

### 'బీజేపీ, ఆర్ఎస్ఎస్, సీపీఎం మధ్య



### ఉన్న బంధం ప్రజలకు తెలుసు'

ఎల్‌డీఎఫ్‌ను ఒక అదృశ్య హస్తం (బీజేపీ, మోదీని ఉద్దేశించి) నడిపిస్తోందని, అదే సీపీఎంలోని నాయకులను, కార్యకర్తలను కలవరపెడుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ అదృశ్య హస్తం మతతత్వమైనదని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని అంగీకరించదన్నారు. ప్రజలను విభజిస్తుందని, ద్వేషాన్ని వ్యాపింపజేస్తుందని తెలిపారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, సీపీఎంల మధ్య ఉన్న సంబంధం కేరళలోని ప్రతి ఒక్కరికి తెలుసని అన్నారు. "లెఫ్ట్ ఫ్రంట్‌లోని చాలా మంది నాయకులు అవకాశవాదులు. కొంతమంది అవకాశవాద నాయకులు అధికారంలోకి రావడానికి ఏదైనా చేస్తారు. వారికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల నుంచి సహాయం అందినా పట్టించుకోరు. మరోవైపు, కొంతమంది ఎల్‌డీఎఫ్ కార్యకర్తలు సిద్ధాంతం కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నారు. వారు ద్రోహానికి, నిరాశకు, బాధకు గురయ్యారు. తమ పార్టీలో జరుగుతున్న పరిణామాల పట్ల చాలా కలత చెందుతున్నారు." అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

### మోదీపై రాహుల్ ఫైర్

ప్రధాని నరేంద్ర మోదీపైనా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. మోదీ తనపైనా, కాంగ్రెస్‌పైనా నిరంతరం మాటల దాడి చేస్తారని అన్నారు. అయితే, ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని ఎందుకు లక్ష్యంగా చేసుకోలేదని ప్రశ్నించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా తాను చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా రాహుల్ గుర్తుచేసుకున్నారు. తనపై 38 కేసులు నమోదైనప్పటికీ తాను కేంద్ర ప్రభుత్వం ముందు ఎన్నడూ వెనకడుగు వేయలేదని తెలిపారు. "నేను బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పోరాడుతాను. నాపై 38 కేసులు ఉన్నాయి. కేంద్రం నా ఇంటిని లాక్కుంది. నేను బెయిల్‌పై బయట ఉన్నాను. వారు నన్ను 55 గంటల పాటు విచారించారు. కానీ నేను ఎప్పుడూ కేంద్రంపై పోరాడడంలో వెనకడుగు వేయలేదు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిసారీ కాంగ్రెస్‌పై దాడి చేస్తారు. ఆయన కేరళ సీఎం విజయన్‌పై, ఆయన కుటుంబం ఎందుకు దాడి చేయరు?. మోదీ తన ప్రతి ప్రసంగంలో దేవుడు, మతం, దేవాలయాల గురించి మాట్లాడతారు. కానీ ఆయన కేరళకు వచ్చినప్పుడు ఎల్‌డీఎఫ్‌కు సహాయం చేయాలనే ఉద్దేశంతో అవన్నీ మర్చిపోతారు. నిజం ఏమిటంటే జాతీయ స్థాయిలో ఎల్‌డీఎఫ్ తనను ఎప్పటికీ సవాలు చేయదని మోదీకి తెలుసు. శబరిమల బంగారు దొంగతనం కేసు గురించి మోదీ ఎందుకు మాట్లాడలేదు" అని రాహుల్ పేర్కొన్నారు.

### డ్రగ్స్ రాజధానిగా కేరళ : రాహుల్ గాంధీ

దేశంలోని వివిధ ప్రాంతాల్లో మైనారిటీలు విస్తృతంగా దాడులను ఎదుర్కొంటున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేరళకు చెందిన ఇద్దరు సన్యాసినులపై ఛత్తీస్‌గఢ్‌లో దాడి జరిగిందన్నారు. మణిపుర్‌లో చర్చిలను తగలబెట్టారని, ఈ పనులు చేస్తున్న వారితో ముఖ్యమంత్రి విజయన్‌కు సంబంధం ఉందని విమర్శించారు. ప్రధాని మోదీ, విజయన్ ఇద్దరూ చాలా కాలం అధికారంలో ఉన్న తర్వాత అహంకారులుగా మారారని, ప్రజలకు దూరమయ్యారని దుయ్యబట్టారు. కేరళ డ్రగ్స్ రాజధానిగా మారిందని, రాష్ట్రంలోని 75 శాతం వరి రైతులు అప్పుల్లో ఉన్నారని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో ఒక కీలకమైన కొబ్బరి పీచు పరిశ్రమ నాశనమైందని, దాదాపు 1.3 లక్షల మంది కార్మికులకు పని లేదన్నారు.

### 'ట్రంప్ ఆదేశాల మేరకే మోదీ పనిచేస్తారు'

అమెరికాతో భారత్ చేసుకున్న వాణిజ్య ఒప్పందాన్ని కూడా రాహుల్ ప్రస్తావించారు. ఈ డీల్ దేశంలోని చిన్న రైతులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆరోపించారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల దేశంలో ఇంధన, గ్యాస్ కొరత ఏర్పడవచ్చని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుమతి లేకుండా భారత్ ఏ దేశం నుంచీ చమురు కొనలేదని ఎద్దేవా చేశారు. చమురు, గ్యాస్ ఎక్కడ కొనాలో చెప్పడానికి అసలు డొనాల్డ్ ట్రంప్ ఎవరని ప్రశ్నించారు. దేశ డేటాను అమెరికాకు అప్పగించారని, దేశీయ ప్రయోజనాలకు హాని కలిగించే విధంగా వ్యవసాయ రంగాన్ని సరళీకరించారని మోదీ సర్కార్‌పై మండిపడ్డారు. ప్రధాని మోదీ ట్రంప్ ఆదేశాల మేరకే పనిచేస్తారని, రాబోయే నెలల్లో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు భారీగా పెరుగుతాయని అన్నారు..

## సంపాదకీయం

# భారత్ సరికొత్త అడుగు

కాలచక్రం ఎప్పుడూ ఒకేలా ఉండదు. చరిత్ర పుటలు తిరగేస్తే ఒకనాటి అద్భుత దృశ్యం కనిపిస్తుంది. ప్రాచీన కాలంలో భారతదేశం ప్రపంచ వాణిజ్యానికి గుండెకాయలా ఉండేది. క్రీస్తు పూర్వం ఒకటవ సహస్రాబ్దిలోనే మన పశ్చిమ తీరాల నుంచి నౌకలు పశ్చియాసియా వైపు పయనించేవి. సింధు లోయ నాగరికత విరాజిల్లుతున్న సమయంలోనే లోథాల్ వంటి ఓడరేవులు మెసొపొటేమియా, ఈజిప్టుతో నిరంతర సంబంధాలు నెరిపేవి. బాబిలోనియన్లు తమ కట్టడాల కోసం భారతీయ టేకును వినియోగించేవారంటే మన ఎగుమతుల స్థాయి ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. రోమన్ సామ్రాజ్యపు సంపద మన సుగంధద్రవ్యాల కోసం, మస్లిన్ వస్త్రాల కోసం భారత్‌కు ప్రవహించేది. 18వ శతాబ్దం వరకు ప్రపంచ తయారీ రంగంలో మనమే అగ్రగామి. చోళులు సముద్రాలను శాసించారు. శాతవాహనులు రోమ్ దాకా వ్యాపారం విస్తరించారు. అదొక స్వర్ణయుగం. ఆ వైభవం మళ్లీ పునరావృతమయ్యే చారిత్రక సందర్భం ఇప్పుడు మన కండ్ల ముందు సాక్షాత్కరిస్తున్నది. ప్రస్తుతం ప్రపంచం ఒక వింతైన సంక్షోభంలో ఉన్నది. మధ్యప్రాచ్యంలో రగులుతున్న టెక్ యుద్ధం దీనికి నిదర్శనం. ఏప్రిల్ 1న బహ్రెయిన్‌లోని 'బాటెల్కో' టెలికాం సంస్థపై జరిగిన దాడులు కేవలం ఒక క్షిపణి సామాన్యమైనవి కావు. అవి గ్లోబల్ టెక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌పై జరిగిన దాడులు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ వంటి దిగ్గజాలు తమ కస్టమర్లను డాటా తరలించుకోమని హెచ్చరించడం ఒక తీవ్రమైన పరిణామం. ఆపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి 18 దిగ్గజ కంపెనీలను ఇరాన్ లక్ష్యంగా ప్రకటించడం ప్రపంచ పెట్టుబడిదారుల్లో గుబులు రేపుతున్నది. గత ఐదేండ్లుగా గల్ఫ్ దేశాలను టెక్ హబ్‌లుగా మార్చడానికి ఖర్చు చేసిన బిలియన్ల డాలర్లు ఇప్పుడు ప్రమాదంలో పడ్డాయి. ఈ అస్థిరత ప్రపంచ టెక్ మ్యాప్‌ను మార్చేస్తున్నది. పెట్టుబడికి ప్రాణం భద్రత. ఎక్కడైతే శాంతి ఉంటుందో అక్కడికే సంపద చేరుతుంది. మధ్యప్రాచ్యం అస్థిరంగా మారిన వేళ.. ప్రపంచమంతా భారత్ వైపు చూస్తున్నది. భారతదేశం ఇప్పుడు ఒక 'టెక్ సేఫ్ జోన్' (వఎష్ట్ర ఝుటవ ్గశీఅవ)గా అవతరించింది. మన దేశంలో ఉన్న సైబర్ భద్రత చట్టాలు, డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ యాక్ట్ వంటివి అంతర్జాతీయ కంపెనీలకు ఒక బలమైన భరోసాను ఇస్తున్నాయి. హైదరాబాద్, బెంగళూర్ వంటి నగరాలు కేవలం ఐటీ సెంటర్లు మాత్రమే కాదు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో కూడిన సురక్షిత దుర్గాలు. యుద్ధ మేఘాలు లేని ఆకాశం, స్థిరమైన ప్రభుత్వం మన దేశానికి అదనపు బలాన్ని ఇస్తున్నాయి. భారతదేశ భౌగోళిక స్థానం మనకు దేవుడిచ్చిన వరం. హిందూ మహాసముద్రం మధ్యలో ఉండటం వల్ల ప్రపంచ వాణిజ్య మార్గాలపై మనకు సహజసిద్ధమైన పట్టు లభిస్తున్నది. సుమారు 7,516 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతం మనల్ని ఆసియా, ఆఫ్రికా, ఐరోపా దేశాలకు వారధిగా నిలబెట్టింది. ఉత్తరాన హిమాలయాలు మనకు రక్షణ కవచంలా ఉన్నాయి. చైనా దూకుడును అడ్డుకోవడంలో భారత్ ఇప్పుడు ఒక 'నెట్ సెక్యూరిటీ ప్రొవైడర్'గా మారింది. ఈ భౌగోళిక రాజకీయ ప్రాధాన్యత వల్లే అగ్రరాజ్యాలు మనతో జట్టు కట్టడానికి పోటీ పడుతున్నాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ పాత్ర ఇప్పుడు అనివార్యం. ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తున్న మరో నినాదం 'చైనా ప్లస్ వన్' (జష్ట్రఱఅఖ ౢాశ్రీబం ాఅవ). గతంలో ప్రపంచమంతా చైనాపైనే ఆధారపడింది. కానీ వాణిజ్య యుద్ధాలు, కొవిడ్ సమయంలో వచ్చిన సరఫరా గొలుసుల అంతరాయం ప్రపంచం కండ్లు తెరిపించాయి. ఒకే దేశంపై ఆధారపడటం ఎంతటి ఆత్మహత్యాసదృశమో కంపెనీలు గుర్తించాయి. ఈ ప్రత్యామ్నాయ వ్యూహంలో భారత్ మొదటి వరుసలో ఉన్నది. ఆపిల్, శామ్‌సంగ్ వంటి సంస్థలు తమ తయారీ కేంద్రాలను చైనా నుంచి భారత్‌కు తరలిస్తున్నాయి. ఇది మన పారిశ్రామిక భవిష్యత్తును మార్చబోయే మహా విప్లవం. మన దేశంలో జరుగుతున్న డిజిటల్ మార్పులు అమోఘం. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు జరుగుతున్న దేశం మనది. సెమీకండక్టర్ల తయారీలో మనం వేస్తున్న అడుగులు భవిష్యత్తులో మనల్ని గ్లోబల్ లీడర్‌గా నిలబెడతాయి. ఇదంతా ఒక క్రమపద్ధతిలో జరుగుతున్న నిర్మాణం. ఈ దశాబ్దం (2020-2030) భారతదేశానిది. అమెరికా-చైనా మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు మనకు ఒక సువర్ణావకాశం. భవిష్యత్తులో భారత్ కేవలం ఒక మార్కెట్‌గానే కాకుండా, ప్రపంచానికి కావాల్సిన ఉత్పత్తులను అందించే కర్మాగారంగా మారుతుంది. చివరగా ఒక మాట. అవకాశం ఎప్పుడూ తలుపు తట్టదు, అది మనల్ని వెతుక్కుంటూ వస్తుంది. ఇప్పుడు ప్రపంచంలో నెలకొన్న అశాంతి, అనిశ్చితి మన దేశానికి ఒక మారువేషంలో వచ్చిన అదృష్టం. గతాన్ని గర్వంగా చెప్పుకోవడమే కాదు, భవిష్యత్తును మనమే నిర్మించుకోవాలి. మన విధానాలు, దౌత్య సంబంధాలు మరింత పటిష్టం కావాలి. పేదరికాన్ని రూపుమాపడానికి, నిరుద్యోగ రక్కసిని తరిమికొట్టడానికి ఇదే సరైన సమయం. ఇది మనకు లభించిన 'ఇప్పుడే.. లేదా ఎప్పటికీ కాదు' అనే కీలకమైన సందర్భం. ఈ అవకాశాన్ని ఒడిసి పట్టుకుంటే, భారతదేశం మళ్లీ ప్రపంచ వేదికపై అగ్రపీఠాన్ని అలంకరించడం ఖాయం.

# గనుల తవ్వకాలు: పర్యావరణ ధ్వంసం



ప్రతి సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని 2005లో ప్రారంభించింది. యుద్ధాలు, సాయుధ పోరాటాలు ముగిసిన తర్వాత కూడా భూమిలో మిగిలి పోయిన మందు పాతరలు, పేలుడు పదార్థాల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. అంతే కాకుండా, వీటిని నిర్మూలించ డానికి జరుగుతున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడం, బాధితులకు సహాయం అందించడం కూడా ఈ దినోత్సవం లక్ష్యాలలో ముఖ్యమైనవి. యుద్ధాలు ముగిసిన తరువాత కూడా మందుపాతరలు ఒక పెద్ద సమస్యగా మిగిలి పోతాయి. ఇవి పొలాలు, రహదారులు, నివాస ప్రాంతాలు ఇలా ఎక్కడైనా ఉండవచ్చు. వీటి గురించి తెలియని సామాన్య ప్రజలు, ముఖ్యంగా పిల్లలు, రైతులు, పేదవారు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. మందు పాతర పేలినప్పుడు ప్రాణనష్టం జరగవచ్చు లేదా శాశ్వత వైకల్యం సంభవించవచ్చు. అంతే కాకుండా, ఇది దేశాల ఆర్థికాభివృద్ధికి కూడా ఆటంకం కలిగిస్తుంది. వ్యవసాయ భూములు నిరుపయోగంగా మారతాయి, రవాణా వ్యవస్థ స్తంభించి పోతుంది, ప్రజలు భయంతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవం ప్రధాన లక్ష్యాలలో...మందు పాతరల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం, మందు పాతరల నిర్మూలనకు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ప్రాజెక్టులకు ఆర్థికంగా, ఇతర విధాలుగా మద్దతు అందించడం, మందు పాతరల బాధితులకు అవసరమైన వైద్య సహాయం, మానసిక మద్దతు, పునరావాస సౌకర్యాలు కల్పించడం, మందు పాతరల సమస్య యొక్క తీవ్రతను తెలియ జేయడం, దీని పరిష్కారానికి అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడం. ఈ దినోత్సవం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజ సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. వీటిలో కొన్ని ముఖ్యమైనవి... మందు పాతరల ప్రమాదాల గురించి అవగాహన కల్పించే ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించడం. మందు పాతరల నిర్మూలనకు సంబంధించిన విషయాలపై చర్చాగోష్ఠులు సెమినార్లు ఏర్పాటు చేయడం. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. మందు పాతరల నిర్మూలనలో పాల్గొనే వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం. మందు పాతరల బాధితులకు మానసిక మరియు వైద్య సహాయం అందించడం, వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం. మందుపాతరల సమస్యపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి మీడియా ప్రచారం నిర్వహించడం.

భారత దేశంలో కూడా సరిహద్దు ప్రాంతాలలో మందు పాతరల సమస్య ఉంది. భారత సైన్యం ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడంలో కీలకమైన పాత్ర పోషిస్తోంది. అయితే, ఈ సమస్య తీవ్రతను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. మందు పాతరల గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు, గనుల తవ్వకం కూడా పర్యావరణానికి తీవ్రమైన నష్టం కలిగిస్తుంది. గనుల నుండి వెలువడే వ్యర్థ పదార్థాలు నేల, నీరు, గాలిని కలుషితం చేస్తాయి. దీనివల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. అంతే కాకుండా, గనుల కోసం అడవులను నరకడం వల్ల వన్య ప్రాణులు వాటి ఆవాసాలను కోల్పోతాయి. జీవ వైవిధ్యానికి నష్టం వాటిల్లుతుంది. గనులలో పనిచేసే కార్మికులకు కూడా ఆరోగ్య సమస్యలు మరియు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కాబట్టి, గనుల తవ్వకం విషయంలో పర్యావరణ హిత విధానాలను అనుసరించడం, కార్మికుల భద్రతను నిర్ధారించడం చాలా ముఖ్యం. అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవం కేవలం ఒక రోజుకు మాత్రమే పరిమితం కాకూడదు. మందు పాతరల సమస్య తీవ్రతను గుర్తించి, దీనిని నిర్మూలించ డానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి. బాధితులకు సహాయం అందించడానికి ముందుకు రావాలి. భవిష్యత్ తరాలకు సురక్షితమైన ప్రపంచాన్ని అందించడమే మనందరి లక్ష్యం. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి మందుపాతరల గురించి అవగాహన పెంచుకోవడం, ఈ సమస్యపై పోరాడటానికి కలిసి రావడం చాలా అవసరం.

# అసమాన శాస్త్ర పరిశోధకుడు

విలియం క్రూక్స్ ప్రఖ్యాత బ్రిటిష్ భౌతిక, రసాయన శాస్త్రవేత్త. క్రూక్స్ రేడియో వికిరణ మాపకం ఆవిష్కర్త. అయన ఉత్సర్గ నాళం రూపకల్పనకు మార్గదర్శి. థాలియం అనే క్రొత్త మూలకాన్ని కనుగొన్నాడు. రాయల్ కాలేజ్ ఆఫ్ కెమిస్ట్రీ, లండన్ లో వర్ణపట శాస్త్రం పై విస్తృత పరిశోధనలు చేశాడు. ఆయన తయారుచేసిన ఉత్సర్గ నాళాన్ని క్రూక్స్ నాళం అని కూడా అంటారు. ఆయన పరిశోధనల ఫలితంగా సెలేనియం యొక్క సంయోగ పదార్థములు కనుగొనబడ్డాయి. ఆయన కేంద్రక రేడియో ధార్మికతను అధ్యయనం చేయుటకు ఉపయోగించే పరికరంను కనుగొన్నాడు. పదార్థం స్థితులలో (ఘన, ద్రవ, వాయు) నాల్గవ స్థితి అయిన ప్లాస్మాను కనుగొనుటలో, ఆ స్థితిని గుర్తించుటలో మొదటి శాస్త్రవేత్తగా నిలచాడు. క్రూక్స్ చేసిన పరిశోధనల వల్ల భౌతిక, రసాయన శాస్త్రాలలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. క్రూక్స్ తన జీవన గమనంలో ఒక అంతరిక్ష శాస్త్రవేత్తగా, ఉపన్యాసకునిగా వివిధ ప్రాంతాలలో పనిచేశాడు. భౌతిక, రసాయన శాస్త్రాలలో అనేక పరిశోధనలు చేశాడు. తన పరిశోధన ముఖ్య లక్షణము ప్రయోగముల ద్వారా వివిధ భావనలను, వాస్తవాలను కనుగొనుటగా భావించాడు. ఆయన అభిరుచు లయిన అనువర్తిత భౌతిక శాస్త్రము, ఆర్థిక, ప్రాయోగిక సమస్యలు, మానసిక సంబంధమైన పరిశోధనలు, ఆయనను ఉన్నత వ్యక్తిగా నిలిపింది. ఆయన అనేక అవార్డులు, గౌరవాలను పొందాడు. ఆయన జీవితం ఒక అసాధారణ శాస్త్రీయ కృత్యాలలతో మమేకం అయింది. సర్ విలియం క్రూక్స్ లండన్ లో 1832 జూన్ 17 లో జన్మించాడు. 1850 నుండి 1854 మధ్య కాలంలో ఆయన కళాశాలలో సహాయకునిగా పనిచేశాడు. అనతి కాలంలో ఆయన కర్బన రసాయన శాస్త్రంలో కాకుండా ఆయనకు ఇష్టమైన రంగంలో ఆయన గురువు విల్‌హెల్‌ం వోన్ హోఫ్మాన్న్ ప్రేరణతో ప్రవేశించాడు. ఆయన పరిశోధనల ఫలితంగా సెలేనియం యొక్క సంయోగ పదార్థములు కనుగొన బడ్డాయి. ఆయన మొదటి పరిశోధనా పత్రాలను 1851 లో ప్రచురించాడు. ఆయన ఆక్స్‌ఫర్డ్ లో రాడ్‌క్లిఫ్ అబ్జర్వేటరీ విభాగంలో 1854 లో, ఛెస్టర్ డియోసియన్ ట్రయినింగ్ కళాశాలలో 1855లో ఉపన్యాసకునిగా పనిచేశాడు. 1859 లో ఆయన కెమికల్ న్యూస్ అనే విజ్ఞానశాస్త్ర పత్రికను ప్రారంభించాడు. అనేక సంవత్సరాలు ఆ పత్రికలో వివిధ మార్పులు చేస్తూ నిర్వహించి అన్ని విజ్ఞాన శాస్త్ర జర్నల్స్ లో అగ్రగామిగా నిలిపాడు. 1861 లో క్రూక్స్ థాలియం అనే క్రొత్త మూలకాన్ని కనుగొన్నాడు. ఈ మూలకం వర్ణపటంలో ఆకుపచ్చని కాంతిని ఉద్గారం చేయుటను గమనించాడు. గ్రీకు భాషలో థల్లోస్ అంటే ఆకుపచ్చని ఉద్గారం అని అర్థము. అలా దానికి థాలియం అని నామకరణం చేశాడు. థాలియంను వర్ణపట విశ్లేషణ సహాయంతో కనుగొన్నాడు. ఆ నూతన ఆవిష్కరణ ఆయనకు ఎనలేని కీర్తిని తెచ్చి తెచ్చింది. ఆయన 1863 లో రాయల్ సొసైటీకి ఫెలోగా ఎంపికయ్యాడు. ఆయన క్రూక్స్ నాళంను అభివృద్ధి చేశాడు. తద్వారా ఋణధృవ కిరణాల ఆవిష్కరణ జరిగింది. ఆయన అనేక పరిశోధనా పత్రాలను వర్ణపట శాస్త్రం పై ప్రచురించాడు. అల్ప పీడనం వద్ద వాయువుల గుండా విద్యుత్ ను ప్రవహింపజేయు పరిశోధనలలో ఆయన అతి తక్కువ పీడనం వద్ద వాయువుల గుండా విద్యుత్ ను ప్రవహింప జేసినపుడు ఋణ ధృవం (కాథోడ్) నుండి కొన్ని కిరణాలు ఉద్గారమగు చున్నట్లు కనుగొన్నాడు. వాటికి "ఋణధృవ కిరణాలు" అని పిలిచాడు. యివి ప్రస్తుతం స్వేచ్ఛా ఎలక్ట్రాన్ల ప్రవాహంగా పిలువ బడు తున్నాయి. ప్రస్తుతం ఇవి కాథోడ్ కిరణ నాళాలలో ఉపయోగ పడుతున్నాయి. ఈ ఉదాహరణల నుండి ఆయన భౌతిక దృగ్విషయాలను అధ్యయనం చేయుటకు ఉపయోగపడే ఉత్సర్గ నాళాల తయారీలో ప్రసిద్ధి పొందాడు. 1879 లో ఆయన పదార్థం యొక్క స్థితులలో (ఘన, ద్రవ, వాయు) నాల్గవ స్థితి అయిన ప్లాస్మాను కనుగొనుటలో, ఆ స్థితిని గుర్తించుటలో మొదటి శాస్త్రవేత్తగా నిలచాడు. క్రూక్స్ ఋణధృవ కిరణాలు లక్షణాలపై పరిశోధనలు చేశాడు. అవి ఋజుమార్గంలో ప్రయాణిస్తాయని, అవి వస్తువులపై పడినపుడు ప్రతిదీప్తిని కలుగ జేస్తాయని కనుగొన్నాడు. పదార్థంలో నాల్గవ స్థితి అయిన "ప్లాస్మా" స్థితిని ఆయన కనుగొన్నాడు. దానికి "రేడియంట్ మేటర్" అని పిలిచాడు. ఋణ ధృవ కిరణాలు అనేవి కొన్ని కణాల ప్రవాహమని నమ్మాడు. ఆ తర్వాత జె.జె.థామ్సన్ వాటిని కనుగొనడానికి భూమికను ఏర్పరచాడు. కాథోడ్ కిరణాలలో గల కణాలకు ఎలక్ట్రాన్ లుగా గుర్తించాడు. క్రూక్స్ చేసిన పరిశోధనల వల్ల భౌతిక, రసాయన శాస్త్రాలలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. దీని ఫలితంగా పరమాణువులో కొత్త కణాల ఆవిష్కరణకు మార్గం సుగమమైంది. 1880 తర్వాత క్రూక్స్ ప్రైవేటు ప్రయోగ శాలలో తన పరిశోధనలను చేశాడు. 1895 లో విలియం క్రూక్స్ హీలియం నమూనాను గుర్తించాడు. 1903 లో ఆయన తన దృష్టిని రేడియో ధార్మికత దృగ్విషయాలపై నిలిపాడు. యురేనియం -ఎక్స్ (తర్వాత ప్రొటాక్టీనియంగా పిలువ బడుతున్నది. యురేని యాన్ని రేడియో ధార్మిక పరివర్తన ఆధారంగా వేరుచేయ గలిగాడు. ఉత్తేజిత పరివర్తన ఆధారంగా యురేనియం నుండి రేడియో ధార్మిక విఘటనాన్ని గమనించాడు. అదే సమయంలో ఆయన రేడియో ధార్మిక పదార్థం నుండి వెలువడే "జూ-కణముల"ను కనుగొన్నాడు. ఈ కణాలు జింక్ సల్ఫైడ్ తెరను ప్రభావితం చేయుట గమనించాడు. క్రూక్స్ 1909 లో "డైమండ్స్" అనే చిన్న పుస్తకాన్ని రాశాడు. 1910లో క్రూక్స్ "ఆర్డర్ ఆఫ్ మెరిట్"ను పొందాడు. ఆయన తన భార్య మరణానంతరం 2 సంవత్సరాల తర్వాత లండన్ లో 4 ఏప్రిల్ 1919 లో మరణించాడు.

## టు లెట్‌లోనూ కుల సంస్కృతి

ప్రపంచం అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతోంది, ప్రపంచ దేశాల మధ్య అభివృద్ధిలో పోటీ సాగుతుంది, ప్రపంచం మొత్తం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం లో పురోగతి ఆడిస్తుంటే మన దేశం కుల పిచ్చిలో పోటీ పడుతోంది, ఆధునిక కాలంలో కూడా అనేక చోట్ల కుల దురహంకారాలు కొనసాగుతూనే ఉంటాయి. వేల సంవత్సరాల క్రితం వేద కాలపు వర్ణ వ్యవస్థలో కుల వివక్ష ఉండేది, వీటి పైన అనేక సంఘసంస్కర్తలు ఉద్యమించి కొంత అవగాహన తీసుకువచ్చాక సమాజంలో కొంత మార్పు వచ్చింది. భారతదేశానికి స్వతంత్రం వచ్చినాక, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన రాజ్యాంగ రచన కమిటీ ఏర్పడింది, ఈ రాజ్యాంగ కమిటీ దేశంలో ఉన్న ప్రజలందరూ సమానమనీ, ఎలాంటి కుల మత లింగ ధనిక పేద వివక్ష ఉండరాదు అని తెలియజేస్తూ రాజ్యాంగాన్ని రూపొందించింది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 76 సంవత్సరాలు గడిచినా దేశంలో కుల వివక్ష అనేది కొనసాగుతూనే ఉంది, గతంలో నగరాల్లో కానీ పట్టణంలో కానీ రూముల అద్దె కోసం వేళితే అన్ని వివరాలు చెప్పిన తర్వాత, మీ పేరేంటి మీరు ఏం పని చేస్తారూ మీది ఎక్కడ అంటూ ప్రశ్నలు సంధిస్తూ కులాన్ని వెతికేవారు, అయినా స్పష్టత రాకపోతే మీరు ఏ కులం అంటూ అడిగేవారు. పలాన కులం అనగానే మొహం మీదే నిరాకరించే వారు. గతంలో సమాజంలో అవగాహన లేక అసమానతలు, కుల వివక్షలు కొనసాగాయి అనుకుంటే, నేటి తరంలో కూడా కులం ఆధారంగా రూములు అద్దె ఇవ్వటం చూస్తుంటే భారత దేశం ఎటు పోతోంది అని విచారమేస్తుంది, టూ లెట్‌లో కుల సంస్కృతి ఈ మధ్య మళ్ళీ దర్శనిస్తోంది. పట్టణంలో ఒక యజమాని టూ లేట్ బోర్డ్ పెట్టటమే కాకుండా దాంట్లో పలాన మతం, కులం వారికి మాత్రమే అంటూ పేర్కొనటం విడ్డూరం, దాంట్లో హిందువులు మాత్రమే అని అనటం హిందువులలో నో ఎస్సీ, ఎస్టీ అని పెట్టటం ఎంత దుర్మార్గం, ఇది ఒక వర్గం వారిని అవమానించటమే. ఎస్సీ ఎస్టీలు హిందూ మతంలో భాగమే. ఇళ్లు హిందూ మతం వారికే అన్నప్పుడు వీళ్లూ హిందువులే కదా అద్దెకు ఎందుకు నిరాకరిస్తున్నారు నో ఎస్సీ, ఎస్టీ అని పెట్టటం అంటే వారు హిందువులు కారు అనటమే అవుతుంది. దీన్ని బట్టి దేశంలో ఇంకా కుల వివక్ష అనేది పెరుగుతుందే తప్ప తగ్గడంలేదు అని స్పష్టంగా కనిపిస్తుంది, ఇంటి యజమానికి కూడా భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుంది, కానీ బావ ప్రకటన స్వేచ్ఛ (ఆర్టికల్ 19(1)జీ ) అనేది హద్దు మీరకూడదు కదా. రాజ్యాంగం ఏం చెబుతోంది అంటే కుల జాతి వివక్షలను వ్యక్తపరచడం నేరంగా భావిస్తుంది, ఇలా బహిరంగంగా ఎస్సీ ఎస్టీలకు ఇవ్వం అని వ్యక్తపరచడం ద్వారా సమాజానికి ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారు, ఎస్సీ ఎస్టీలు ఇక్కడ పుట్టి పెరిగిన భారతీయ హిందువులే కదా, ఎక్కడో వేరే దేశంలో ఉన్న హిందువుల పైన దాడిని ఖండిస్తూ సానుభూతి తెలియజేసే వారు, ఈ దేశ ఎస్సీ ఎస్టీ హిందువుల పైన కుల వివక్ష చూపించడం సమంజసమా మన తోటి వారిని మనమే అవమానించుకుంటూ మళ్లీ వేద కాలంలోకి వెళ్దామా! ఇలా వివక్షలు కొనసాగుతూ ఉంటే దేశం ఎలా పురోగతి సాధిస్తుంది? ఎలాంటి వివక్షలు లేని సమాజాన్ని నిర్మించడంలో అందరూ భాగస్వాములు అవ్వాలి, అందరూ సమానమనే అవగాహనతో ఇలాంటి కుల ఆధారిత వివక్షలను అరికట్టాలి. అందరం ఒకటే అనే భావన కలగాలి.

## జిల్లాలో తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్ల బదిలీ

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):**

జిల్లాలో తహసీల్దార్లు మరియు నాయబ్ తహసీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు తమకు కేటాయించిన కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో చేరిన వెంటనే సంబంధిత చేరిక నివేదికలను సమర్పించాలని స్పష్టంచేశారు. అధికారులు విధుల్లో చేరడంలో ఆలస్యం చేయకుండా, ప్రభుత్వ పరిపాలనా పనులు నిరంతరంగా సాగేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## మహాత్మా జ్యోతి బా పూలే పాఠశాలలో కలెక్టర్ తనిఖీ
## విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి





**గణపురం, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):**

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం గణపురం మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మెనూ అమలు, గ్యాస్ సరఫరా, సౌకర్యాలు తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. హలో స్టూడెంట్స్ ఎలా ఉన్నారు.. పరీక్షలు ఎలా వ్రాస్తున్నారు.. ఇప్పటికే 5 పరీక్షలు పూర్తయ్యాయి, ఇంకా రెండు పరీక్షలు మిగిలి ఉన్నాయి. మీరు ఎలా ప్రిపేర్ అవుతున్నారు అంటూ విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు సూచనలు చేస్తూ మంచిగా చదువుకోవాలి, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఈ పాఠశాలలో మీది మొదటి బ్యాచ్ కాబట్టి మీ తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ కలెక్టర్ బెస్ట్ విషెస్ తెలిపారు. ప్రహరీ, సిసి కెమెరాలు, డిజిటల్ తరగతులు, డైనింగ్ హాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి ఇందిర, డీఈఓ రాజేందర్, ఎస్ ఓ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతా
### ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది



**పరకాల, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):**

శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని రాజుపేట లో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.
విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,ఈ పాఠశాల ద్వారా స్థానిక విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు.నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా, సమయానికి పూర్తి చేసి 18 నెలలలో అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు.అలాగే త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శంకుస్థాపన చేస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మేమే చేస్తాం అని అన్నారు.

## మేడారం గద్దెల వద్ద గాయపడ్డ యువన్ ను పరామర్శించి మధుసూదనాచారి,బడే నాగజ్యోతి

**హనుమకొండ, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):**



మేడారం గద్దెల వద్ద గత నెల 25న జరిగిన ప్రమాదనీకి మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ బాధ్యత వహించాలని, తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. హన్మకొండ లో ఓ ప్రైవేటు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సమ్మక్క పూజారి కుమారుడు యువన్ ను పరామర్శించారు. బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బాలుడికి తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. మంత్రి సీతక్క వచ్చి పరామర్శించి 10వేలు చేతిలో పెట్టి వెళ్లడం దారుణమని అన్నారు. మంత్రులు ఇప్పటివరకు బాలుడిని ఆదుకునేందుకు ముందుకు రాకపోవడంపై అగ్రహం వ్యక్తం చేశారు. బాలుడికి అయ్యే ఖర్చు వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించి, అతడి భవిష్యత్తు కోసం కోటి రూపాయలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బాధితుడి తల్లిదండ్రులకు ఒక్కరి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సూచించారు, వీరివెంట ఎట్టి జగదీష్, మాజీ జడ్పీటీసీ రామాసహాయం శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్, ఈసం రామ్మూర్తి, మాజీ మదరి రామయ్య, నాయకులు కొనుకంటి ప్రశాంత్, తాడ్వాయి మండల యూత్ అధ్యక్షులు కోట సురేష్ తదితరులు పాల్గొన్నారు

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి
## రాష్ట్ర ఎలక్టోరల్ అధికారి సీ. సుదర్శన్ రెడ్డి

**మహబూబాబాద్ జిల్లా, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):**



తెలంగాణలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై రాష్ట్ర ఎలక్టోరల్ అధికారి సీ. సుదర్శన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎలక్టోరల్ అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రాజకీయ పార్టీల ద్వారా పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్లను ఖచ్చితంగా నియమించుకోవాలని అదేశించారు. బీఎల్ఏలకు కూడా అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే సూపర్వైజర్ లకు కూడా వారి పరిధిలో స్థానికంగా తెలిసి ఉండాలని, ఈ ఎస్ఐఆర్ పై అవగాహన కలిగి ఉండాలని, బీఎల్ఓలకు ఏ సందేహం ఉన్నా కూడా నివృత్తి చేయాలని సూచించారు. బీఎల్ఓలు స్థానిక నివాసి అయి ఉండాలన్నారు. ఆ ఏరియా పట్ల పూర్తి అవగాహనతో ఉండాలని, అప్పుడే సులభంగా ఓటర్ల ఇళ్లను గుర్తించి సమాచారాన్ని సేకరించవచ్చన్నారు. డేటా సురక్షతపై ప్రత్యేక దృష్టి సారించాలని, బీఎల్ఓలు యాప్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, యాప్ ఉపయోగం గురించి తెలిసి ఉండాలని, పాస్వర్డ్ ఎవరితోనూ పంచుకోకూడదన్నారు. పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి రోజు పురోగతి నివేదికను తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. ప్రధానంగా ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ఏఈఆర్ఓ, ఈఆర్ఓ స్థాయిలో ఐటీ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేస్తూ అవసరమైన సమాచారాన్ని అందించి, అందులోని అంశాలను వారికి తెలియజేయాలని సూచించారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులకు జిల్లా స్నేహ శబరీష్ పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో మహబూబాబాద్, తొర్రూరు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, క్రిష్ణవేణి, గణేష్, సంబంధిత తహసిల్దార్లు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా మొక్కజొన్న కొనాలి





**జిల్లాలో 1లక్ష 30 వేల ఎకరాలలో పంట సాగు**

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్**

**మహబూబాబాద్ జిల్లా, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):**

జిల్లాలోని మొక్కజొన్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్దతు ధర కల్పిస్తూ కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శనివారం మహబూబాబాద్ పట్టణం ఇల్లందు రోడ్డు లోని వ్యవసాయ మార్కెట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఈ సందర్భంగా రైతులు, మార్కెటింగ్, వ్యవసాయ, సంబంధిత అధికారులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడారు. జిల్లాలో ఈ సంవత్సరం 1లక్ష 30 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు జరిగిందని, సుమారు లక్ష ఎకరాల మొక్కలు కొనుగోలుకు వస్తున్నాయని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మార్కెట్లో అన్ని వసతులు సౌకర్యాలు కల్పిస్తూ వచ్చిన మొక్కజొన్నలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు చేయాలని, మద్దతు ధర 2400/- చెల్లించాలని రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి ఈ నామ్ విధానం ద్వారా కొనుగోలు చేయాలన్నారు, పెసర్లు, మినుములు, వేరుశనగ, తదితర పంటల వైపు రైతులకు అవగాహన కల్పించాలని ఈ పంటల ద్వారా ప్రస్తుతం మార్కెట్లో అధిక ధరలు పలుకుతున్నందున రైతులు లాభాలలో ఉంటారని అన్నారు. అందుకు సంబంధిత శాఖల అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మార్కెట్లో అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని నియమించుకోవడం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, మార్కెట్లో అంతర్గత సౌకర్యాలను అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, వైస్ చైర్మన్ మదన్ గోపాల్ లోయ, వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ సుజన్ బాబు, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, ఏ డి ఏ శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ డిఎం వెంకటేశ్వర్లు, ఏఓ తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి
## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**ములుగు జిల్లా, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):**



ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర ఎన్నికల కార్యాలయం హైదరాబాద్ నుండి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, బిఎల్వోఓ, బూతు ఏజంట్లు తదితర అంశాలపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ములుగు కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి సాధించాలని, బూత్ స్థాయి అధికారులు మ్యాపింగ్ త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం జరిగేలా కృషి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు శిక్షణ అందించాలని, బూత్ స్థాయి ఏజెంట్లకు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు శిక్షణ సంబంధిత మెటీరియల్ అందజేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల పోస్టులు ఖాళీగా ఉండకుండా చూసుకోవాలని, ఎక్కడైనా ఖాళీలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారులను నియమించాలని తెలిపారు. పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను తొందరగా పరిష్కరించాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమ సంబంధిత సిబ్బందికి శిక్షణ అందించడం జరిగిందని, జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేట అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న ఆంధ్ర అధికారులు

**కాజీపేట జంక్షన్ ను డివిజన్ చేయాలి.. కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి**

**చిరు వ్యాపారులకు సముదాయాలు కట్టించాలి.. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్**




**కాజీపేట, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):** కాజీపేట జంక్షన్ ను డివిజన్ చేయాలని, పోరాడి సాధించినటువంటి కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు 80శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, చిరు వ్యాపారులకు సముదాయాలు కట్టించాలని బి. ఆర్.ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాజీపేట లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక అంశాల పైన రైల్వే జీఎంను మాజీ పార్లమెంటు సభ్యులు వినోద్ కుమార్, కాజీపేట స్థానిక నాయకులతో కలిసి మార్చి 9వ తేదీన వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. వినతి పత్రానికి బదులుగా చీఫ్ మెకానికల్ ఇంజనీర్ ఈ సమస్యలలో కొన్నింటి పై వివరణను లికిత పూర్వకంగా సమాధానం ఇచ్చారని, రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ( ఆర్ ఎం యు ) ను ఆర్ వి ఎన్ ఎల్ కు అప్పగించడం జరిగిందని తెలిపారు అన్నారు. అందులో 75 శాతం పనులు పూర్తి అయ్యాయని, మిగతా పనులు పూర్తికావడానికి మూడు నుండి నాలుగు నెలల సమయం పడుతుందని అధికారులు తెలిపారని, రైల్వే బోర్డు ఈ కోచ్ ఫ్యాక్టరీని చెన్నై లోని కోచ్ ఫ్యాక్టరీ తో కలిపి ఒక డి.పి.ఆర్ తయారు చేయమని వారిని కోరడం జరిగిందన్నారు. డి.పి.ఆర్ వచ్చిన తర్వాత ఒక సంవత్సర కాలం పాటు కోచ్ ఫ్యాక్టరీలోని అంశాలన్నీ పూర్తి అవుతాయని చీఫ్ మెకానికల్ ఇంజనీర్ తెలిపారని అన్నారు. అయితే మొదటి నుండి కాజీపేట జంక్షన్, కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట అభివృద్ధి కోసం కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తున్నామని, తెలంగాణ కోసం బి ఆర్ ఎస్ పార్టీ 14 ఏళ్లపాటు ఏ విధంగానైతే ఉద్యమాలు చేసిందో, కాజీపేట జంక్షన్ ఏర్పాటు, కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట అభివృద్ధి కోసం కూడా గత 50 ఏళ్ల నుంచి ఉద్యమం చేస్తున్నామని అన్నారు. గులాబీ సైనికులు ఎడతెరిపి లేకుండా ఉద్యమాలు చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అన్నారు. కోచ్ ఫ్యాక్టరీ ఇక్కడ ఏర్పడుతుందని ప్రకటన చేసి, పంజాబ్ కు తరలిస్తే బిఆర్ఎస్ పార్టీ మరొక్కసారి ఉద్యమం చేసిందని, ఏపీ రీ ఆర్గనైజేషన్ కమిటీలో సైతం కెసిఆర్ ముందు చూపుతో ఈ కోచ్ ఫ్యాక్టరీ ని పొందుపరిచిందన్న విషయాన్ని గుర్తు చేశారు. కాజీపేట రైల్వే డివిజన్ అభివృద్ధి, రైల్వే జంక్షన్ ఇప్పటిది కాదని నిజాం కాలం లోనే ఉందని అన్నారు. స్థానిక సమస్యల పైన, రైల్వే డివిజన్ అభివృద్ధి పైన అధికారంలో ఉన్న, ప్రతిపక్షంలో ఉన్న ఎప్పుడు ప్రజల పక్షాన్నే కొట్లాడుతామని అన్నారు. ఇంకా అనేక పరిశ్రమలు రావాలని కోరుకుంటున్నామని అన్నారు. ఇప్పటికీ రైల్వే అధికారులలో ఆంధ్ర పెత్తనం నడుస్తుందని, ఆంధ్ర అధికారుల కనుసన్నాల్లో అభివృద్ధికి ఆటంకం కలగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.ఇటీవల కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కేటీఆర్ కలిసినప్పుడు కాజీపేట జంక్షన్ ను డివిజన్ చేయాలని తెలిపారని, దానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని అన్నారు. కానీ రైల్వే జీఎం నిన్న మొన్న మాట్లాడుతూ డివిజన్ అనే ప్రస్తావనే లేదని తెలపడం బాధాకరమన్నారు. కాజీపేట జంక్షన్ ను కాజీపేట డివిజన్ స్థాయిగా ఏర్పాటు చేసే వరకు పోరాడుతామని అన్నారు. రైల్వే పరిధిలో 1500 నుండి 2000 కిలోమీటర్ల ట్రాక్ కు ఒక డివిజన్ ఏర్పాటు చేయాలని, కానీ సికింద్రాబాద్ చూస్తే 3,100 కిలోమీటర్లు ఉందన్నారు. ఇంత ఎక్కువ గా ట్రాక్ ఉన్నటువంటి సందర్భంలో అధికారులు గానీ, కార్మికులు గానీ ఎంతో మానసిక, శారీరక ఒత్తిడితో పని చేస్తున్నారని, వైజాగ్ లో సౌత్ కోస్టల్ లో ఒక డివిజన్ చేసినప్పుడు, తెలంగాణలో కాజీపేట ను డివిజన్ చేయడానికి అభ్యంతరం ఏముందని ప్రశ్నించారు. దేశానికే కాజీపేట గుండెకాయ లాంటిదని, సెంట్రల్ రైల్వేలో కాజీపేట జంక్షన్ నుండే అధిక రాబడి వస్తుందని తెలిపారు.చారిత్రాత్మక నేపథ్యం ఉన్నటువంటి కాజీపేట జంక్షన్ ను డివిజన్ స్థాయి చేయాలని, అప్పటివరకు దశలవారీగా పోరాటం చేస్తామని అన్నారు. స్థానికంగా ఇల్లు కోల్పోయిన, భూములు కోల్పోయినటువంటి వారికి కోచ్ ఫ్యాక్టరీలో ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్కువ ట్రాక్ రికార్డు ఉన్నటువంటి వాటిని డివిజన్ చేస్తున్నారని ఇంత ఎక్కువ ట్రాక్ ఉన్నటువంటి కాజీపేట జంక్షన్ ను డివిజన్ చేస్తే తప్పే లేదన్నారు.ఈ సందర్భంగా తక్కువ ట్రాక్ ఉన్నటువంటి డివిజన్ల విషయాన్ని గుర్తు చేశారు.నిరుద్యోగులతోని,భూములు కోల్పోయినటువంటి నిర్వాసితులతోని, స్థానికులతోని చర్చించిన తర్వాత పెద్ద ఎత్తున రైల్వే జీఎం ఎదుట ధర్నా నిర్వహిస్తామని, అక్కడ కూడా స్పందించకపోతే ఇక్కడి ప్రజల ఓట్లతో గెలిచినటువంటి కాంగ్రెస్, బిజెపి ఎంపీల నివాసాల వద్ద నిరసన తెలుపుతామన్నారు.ఈ గెజిట్లో పై అంశాలన్నీ కూడా పొందుపరచకుండా ఉంటే ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తామని అన్నారు. కోచ్ ఫ్యాక్టరీని వర్చువల్ గా ప్రారంభిస్తామని ప్రధానమంత్రి తెలపడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. కాజీపేట జంక్షన్ ను డివిజన్ చేయకున్న,కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు 80 శాతం ఉద్యోగ అవకాశాలు ఇయ్యకున్న ప్రధానమంత్రి ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటామని తెలిపారు. ప్రజల ఓట్లతో గెలిచి, వారి మనోభావాలకు అనుకూలంగా వ్యవహరించని కాంగ్రెస్,బిజెపి ఎంపీల ఇళ్లను గేరావ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వేణు, బి ఆర్ ఎస్ నాయకులు నార్లగిరి రమేష్, కుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నపై మరో పిడుగు!

**200 కోట్ల విలువైన గురుకుల యూనిఫామ్ ఆర్డర్లు ప్రైవేటుకు!**

**టెస్కోను పక్కకునెట్టి సాంఘిక సంక్షేమ విద్యార్థుల యూనిఫామ్‌లకు ఈ-టెండర్లు**

**గుట్టుచప్పుడు కాకుండా నోటిఫికేషన్**

**రోడ్డునపడనున్న చేనేత, పవర్‌లూమ్ వర్కర్స్**

**ఇప్పటికే 105.54కోట్ల స్కూల్ యూనిఫామ్ ఆర్డర్ల రద్దుతో నిలిచిపోయిన సాంచాలు**

**తామిచ్చిన జీవోకు కాంగ్రెస్ సర్కారే తూట్లు**



**కరీంనగర్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరిన తరువాత నేతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. చేనేత కార్మికులకు ఇస్తున్న ఒక్కో ఆర్డర్‌ను రద్దు చేస్తున్న ప్రభుత్వం.. తాజాగా మరో షాక్ ఇచ్చింది. సుమారు రూ.200 కోట్ల విలువైన వస్త్రోత్పత్తికి సంబంధించిన ఆర్డర్‌ను టెస్కోకు ఇవ్వకుండా.. శుక్రవారం ఈ-టెండర్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ చర్య నేతన్నల ఉపాధికి తీవ్ర విఘాతం కలిగిస్తుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది. చేనేత పరిశ్రమను ప్రోత్సహించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామంటూ రెండేండ్ల క్రితం జీవో-1 విడుదల చేసిన ప్రభుత్వమే ఇప్పుడు దానికి తూట్లు పొడుస్తున్నది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి టెసోకు ఇచ్చిన రూ.105 కోట్ల విలువైన యూనిఫామ్ ఆర్డర్‌ను ఇటీవల రద్దు చేయడంతో శుక్రవారం మెజారిటీ సాంచాలు నిలిచిపోయాయి. కార్మికులకు ఉపాధిలేకుండా పోయింది. ప్రభుత్వం ఇదే విధానాన్ని కొనసాగిస్తే మరో వారం పది రోజుల్లో వస్త్రోత్పత్తి పరిశ్రమ కుదేలై.. కార్మికలోకం ఆకలికేకల పాలయ్యే ప్రమాదం కనిపిస్తున్నది.తెలంగాణ పర్యాటకం

**తాము ఇచ్చిన జీవోకు తామే తూట్లు!**

చేనేత పరిశ్రమను ప్రోత్సహించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, 2024 మార్చి 11న జీవో-1 జారీ చేసిన ప్ర భుత్వం.. నేతన్నలకు నిరంతర ఉపాధి కల్పించడానికి తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (టెస్కో) ద్వారా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్న ది. అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, ప్రభుత్వ దవాఖానలు తదితర సంస్థలకు అవసరమైన అన్ని రకాల వస్త్రాన్ని టెస్కో ద్వారా తీసుకోవాలని ఆ జీవోలో స్పష్టంచేసింది. ఆయా ప్రభుత్వ శాఖలు ఆర్డర్స్ ఇచ్చిన తర్వా త ఒకవేళ టెస్కో సంబంధిత మెటీరియల్ సరఫరా చేయలేకపోయినా, డిమాండ్ మేరకు సరకు అందుబాటులో లేకపోయినా, ఆయా శాఖల నుంచి ఆర్డర్లు అందిన ఒక వారంలోగా మెటీరియల్ అందుబాటులో లేదని టెస్కో నుంచి (నాన్-అవైలబిలిటీ సర్టిఫికెట్) అధికారికంగా సంబంధిత శాఖలు ధ్రువీకరణ పత్రం పొందిన తర్వాత మాత్రమే చేనేత, పవర్‌లూ మ్ సొసైటీల నుంచి కాకుండా ఇతర ఏజెన్సీల నుంచి సేకరించడానికి అనుమతి ఉంటుందని ఆ జీవోలో పేర్కొన్నది. ఈ నిబంధనలను అన్ని ప్రభుత్వ సంస్థలు పాటించాలని స్పష్టంచేసింది. కానీ, ఇప్పుడు అదే జీవోకు తూట్లు పొడుస్తున్నది. ఏకంగా ఈ-టెండర్లు పిలుస్తూ ప్రైవేట్ సంస్థలకు మేలు చేసేలా చేస్తుంది.

**నేతన్నలకు ఉపాధి ఎలా?**

స్వరాష్ట్రం సాధించిన తర్వాత నేతన్నల ఉపాధికి కేసీఆర్ హయాంలో పకడ్బందీ ప్రణాళికలు రచించారు. ఎన్నో పథకాలు అమల్లోకి తెచ్చారు. నిరంతర ఉపాధి ద్వారా మాత్రమే నేతన్నల బతుకులు మారుతాయని భావించి, బతుకమ్మ చీరల నుంచి స్కూల్ యూనిఫామ్‌ల వరకు వస్త్రోత్పత్తి బాధ్యతను టెస్కో ద్వారా చేనేత, మ్యాక్స్ సంఘాలకు అప్పగించారు. ఒక్కో సంఘానికి ఆర్డర్లు ఇచ్చి, వారి నుంచి ఆయా శాఖలకు కావాల్సిన వస్త్రాలను సేకరించి తద్వారా నిధులు సమకూర్చింది. ఒక్కో కార్మికుడు నెలకు రూ.15వేల వరకు సంపాదించుకునే వెసులుబాటు కల్పించింది. ఫలితంగా నేతన్నలు అత్యధికంగా ఉన్న సిరిసిల్ల లాంటి ప్రాంతాల్లోని సాంచాలు నిరంతరం నడువడంతో ఆకలి చావులు, ఆత్మహత్యలు దూరమయ్యాయి. కేసీఆర్ సర్కార్‌కు మించి నేతన్నలకు అండగా ఉంటామని ఎన్నికల వాగ్దానం చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలున్నాయి. కొత్తవి దేవుడెరుగు.. ఉన్నవాటికి మంగళం పాడుతున్నది. ప్రస్తుతం ఒక్కో శాఖ నుంచి రావాల్సిన వందలాది కోట్ల ఆర్డర్లను రద్దు చేసి ఈ-టెండర్లు పిలిస్తే చేనేత, మ్యాక్స్ సంఘాల పరిధిలో పనిచేసే నేతన్నలకు ఉపాధి ఎలా దొరుకుతుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**నిలిచిన సాంచాలు.. రోడ్డున పడ్డ కార్మికులు**

రూ.105.5 కోట్ల విలువైన ఆర్డర్ల రద్దు విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. దీంతో శుక్రవారం సిరిసిల్లలోని పలు సాంచాలను నిలిపివేశారు. ఇప్పటికే చేసిన వస్త్రోత్పత్తిని ఎవరికి ఇవ్వాలో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్న సంఘాలు.. మళ్లీ ఉత్పత్తి చేస్తే నష్టాల పాలవుతామన్న ఉద్దేశంతో సాంచాలను నిలిపివేశాయి. దీంతో చేనేత కార్మికులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సర్కార్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రధానంగా సిరిసిల్ల నేతన్నలకు పెనుశాపంగా మారుతున్నాయి. ప్రభుత్వ శాఖల నుంచి వచ్చే ఆర్డర్లలో దాదాపు 80%పైగా బట్ట ఇక్కడే ఉత్పత్తి అవుతున్నది. సజావుగా సాంచాలు నడిస్తే రోజుకు ఆరు వేల నుంచి ఎనిమిది వేల మంది కార్మికులు ఈ సంచాలపై పనిచేస్తారు. అందుకే ఆర్డర్ల రద్దు ప్రభావం సిరిసిల్లపై అత్యధికంగా కనిపిస్తున్నది.

## రాష్ట్ర కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను కలిసిన వరంగల్ జిల్లా కలెక్టర్



**వరంగల్ జిల్లా, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్)** రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్ హనుమకొండలోని టీజీఎన్‌పీడీసీఎల్ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నవీన్ మిట్టల్ కి మొక్కను అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జిల్లాలో విద్యుత్ సరఫరా, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, టీజీఆర్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళి చెరువులో పూడిక తీత పనుల్లో వేగం పెంచాలి

**కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



**హన్మకొండ జిల్లా, ఏప్రిల్ 04 (తీన్మార్ న్యూస్):** భద్రకాళి చెరువులో జరుగుతున్న పూడిక తీత పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఇరిగేషన్, కుడా శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ భద్రకాళి చెరువులో పూడిక తీత పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించి, సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెరువులో మొత్తం ఏడు లక్షల డెబ్బై వేల క్యూబిక్ మీటర్ల పూడిక తీత లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు సుమారు ఒక లక్ష క్యూబిక్ మీటర్ల పూడికను తొలగించినట్లు తెలిపారు. మిగిలిన పనులను మరింత వేగంగా పూర్తి చేసి మే 15వ తేదీలోగా పూడిక తీత పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శాయంపేటలో జరుగుతున్న భూముల సర్వే పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ భూములు అక్రమ ఆక్రమణలకు గురికాకుండా కుడా ఆధీనంలో నున్న భూములకు వెంటనే ప్రహరీ గోడలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కుడా పీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్రావు, ఇరిగేషన్ ఈఈ కిరణ్ కుమార్, డీఈ మధుసూదన్, ఏఈ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## 9న మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పర్యటన విజయవంతం చేద్దాం.

**వనపర్తి :** గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ నిర్మాణ ప్రతిపాదన వ్యర్థం.ప్రజాధనాన్ని లూటీ చేయడానికి కాంగ్రెస్ నాయకుల ప్రయత్నం. మాజీ మంత్రి. మాజీ మంత్రి తన్నీరు.హరీష్ రావు ఈనెల 9న గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ నిర్మాణ ప్రతిపాదన వ్యతిరేఖ అఖిలపక్ష పోరాట సమితి నాయకులు చేస్తున్న దీక్షలకు సంఘీభావం తెలపడానికి వస్తున్నారని వారి పర్యటన విజయవంతం చేయాలి అని సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. హరీష్ రావు పర్యటన కోసం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశములో నిరంజన్ రెడ్డి రావుల.చంద్రశేఖర్ రెడ్డి తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర అత్యంత కీలకమైందని ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెచ్చి ప్రజలకు అండగా నిలవాలని అన్నారు. ప్రజా ధనాన్ని లూటీ చేయడానికి కాంగ్రెస్ నాయకులు గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ ప్రతిపాదన ముందుకు తెచ్చారని దీన్ని వ్యతిరేకిస్తూ రైతులు 97రోజులుగా దీక్షలు చేస్తున్న పట్టించుకోకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి తెలియజేస్తుందని అన్నారు. హరీష్ రావు పర్యటనతో రైతులకు ఖచ్చితంగా మేలు జరుగుతుందని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.ప్రజలు,నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

మరోసారీ నిరంజన్ రెడ్డి గెలుపు అభివృద్ధికి మలుపు. రావుల. చంద్రశేఖర్ రెడ్డి మాజీ ఎం.పి. నిరంజన్ రెడ్డి ఆధ్వర్యములో హరీష్ రావు పర్యటన విజయవంతం చేద్దాం అని రావుల చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. 99రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక చేసేముందు ఆరు గ్యారంటీలు 11డిక్లరేషన్లు,420హామీల గూర్చి ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 9తారీఖు హరీష్ రావు గారి పర్యటనను విజయవంతం చేయాలి అని విజ్ఞప్తి చేశారు. కె.సి.ఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి అమానుషం. గజ్వేల్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గుండాలు దాడి చేయడాని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.

## మహిళలు వృత్తి శిక్షణల ద్వారా ఆర్థిక స్వేచ్ఛ సాధించాలి

**వారికి ప్రభుత్వము ఎప్పుడు అండగా ఉంటుంది.**

**మహబూబ్నగర్ ఎమ్మెల్యే ఎన్.ఎం శ్రీనివాసరెడ్డి.**

**మహబూబ్నగర్ మేయర్ గుమ్మల మమతా శ్రీనివాస్.**

**వనపర్తి :** శనివారంమహబూబ్‌నగర్ పట్టణ ప్రాంతంలోని స్వయం సహాయక సంఘాల (రాఊఉ) మహిళలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే దిశగా స్కూల్ యూనిఫాం టైలరింగ్ మరియు కటింగ్ రంగంలో శిక్షణ ఇచ్చేందుకు 4 రోజుల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ విశేష కార్యక్రమానికి గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు మున్సిపల్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ గారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్ గారు, మరియు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా, ఇలాంటి శిక్షణా కార్యక్రమాల ద్వారా ఆర్థిక స్వేచ్ఛను సాధించాలని, వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నేతలు ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

## బిజినెస్

### ఇరాన్ ప్రకటనపై స్పందించిన డెల్.. ఉద్యోగులకు ట్రావెల్ అడ్వయిజరీ జారీ




ఇరాన్ ప్రభుత్వం తనను ఉగ్రవాద సంస్థ గా ప్రకటించడంపై అమెరికాకు చెందిన మల్టీనేషనల్ కంపెనీ డెల్ స్పందించింది. తన ఉద్యోగుల రక్షణే ప్రథమ కర్తవ్యంగా భావిస్తూ అంతర్గతంగా ట్రావెల్ అడ్వయిజరీ జారీచేసింది. ఉద్యోగులెవరూ ఇరాన్‌కు వెళ్లవద్దని, అక్కడ ఉన్నవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించింది. ఇరాన్ సంస్థలు లేదా ఆ దేశ వ్యక్తులతో ఎలాంటి ప్రత్యక్ష, పరోక్ష వ్యాపార లావాదేవీలు పెట్టుకోవద్దని కఠిన ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా కంపెనీ డేటా, నెట్‌వర్క్ భద్రతపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని డెల్ తన ఐటీ విభాగాలను హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అమెరికా–ఇరాన్ ఘర్షణ ఇప్పుడు క్షిపణుల నుంచి గ్లోబల్ టెక్నాలజీ, ఫైనాన్స్ సంస్థల వైపు మళ్లినట్టుగా కనిపిస్తోంది. అమెరికాకు చెందిన 18 ప్రముఖ కంపెనీలు తమ హిట్ లిస్టులో ఉన్నాయని ఐఆర్జీసీ తన టెలిగ్రామ్ ఛానల్ ద్వారా స్పష్టంచేసింది. ఈ ఐటీ సంస్థలన్నీ అమెరికా నిఘా వర్గాలకు సమాచారాన్ని చేరవేస్తున్నాయని ఆరోపించింది.

### మొన్న పెట్రోల్.. నేడు సీఎన్‌జీ: పెరిగిన ధరలు!




పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైన తరువాత ప్రపంచంలోని చాలా దేశాల్లో ఇంధన ధరలు పెరిగాయి. గ్యాస్ కొరత ఏర్పడింది. ఇలాంటి సమయంలో మన దేశంలోని టొరెంట్ గ్యాస్ సంస్థ జైపూర్‌లో కేజీ కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ ధరను రూ.2.50 పెంచింది. దీంతో వినియోగదారులపై పెరుగుతున్న వ్యయ భారం మరింత పెరిగింది. ఇంధన ధరలలో విస్తృతమైన పెరుగుదల సవరణల మధ్య ఈ పెంపు చోటుచేసుకుంది, ఏప్రిల్ 1 నుంచి వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్లు, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలు కూడా పెరిగాయి. సీఎన్‌జీ ధరల పెంపుతో పాటు, చమురు మార్కెటింగ్ కంపెనీలు ప్రధాన నగరాల వ్యాప్తంగా వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరలను పెంచాయి. ఢిల్లీలో 19 కేజీల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.195.50 పెరిగి రూ.2,078.50కి చేరింది. 5 కేజీల చిన్న సిలిండర్ల ధరలు కూడా రూ.51 మేర పెరిగింది. కోల్‌కతాలో 19 కేజీల వాణిజ్య సిలిండర్ల ధరలు ఏకంగా రూ.218 మేర పెరిగాయి. మంత్రిత్వ శాఖ ప్రకారం.. ప్రపంచ మార్కెట్ పోకడల ఆధారంగా వాణిజ్య ఎల్‌పీజీ ధరలను నెలవారీగా సవరిస్తారు. తాజా ధరల పెంపునకు కారణం.. సౌదీ కాంట్రాక్ట్ ధరలో 44% భారీ పెరుగుదలే అని తెలుస్తోంది. ఈ ధర మార్చిలో మెట్రిక్ టన్నుకు 542 డాలర్ల నుంచి ఏప్రిల్‌లో మెట్రిక్ టన్నుకు 780 డాలర్లకు పెరిగింది. ఎల్‌పీజీ సరఫరా తగ్గిపోవడం కూడా సిలిండర్ ధరలు పెరగడానికి కారణం అవుతోంది.

# కరిగిపోతున్న విదేశీ నిల్వలు..
# మరో రూ.లక్ష కోట్లు డౌన్

**ముంబై :** విదేశీ మారకం నిల్వలు కరిగిపోతున్నాయి. రూపాయి విలువ పాతాళానికి పడిపోవడంతోపాటు విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ అంతకంతకు పడిపోవడంతో ఫారెక్స్ రిజర్వుల భారీగా పడిపోతున్నాయి. మార్చి నెల చివరివారంలో ఫార్స్ రిజర్వులు 10.288 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.లక్ష కోట్లు) తరిగిపోయి 688.058 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 11.414 బిలియన్ డాలర్లు పడిపోయిన విషయం తెలిసిందే. మొత్తంగా వరుసగా రెండు వారాల్లో రిజర్వులు 22 బిలియన్ డాలర్లు పడిపోయాయి. ఈ ఏడాది ఫిబ్రవరి చివరి వారంలో రికార్డు స్థాయి 728.494 బిలియన్ డాలర్లకు చేరుకున్న ఫారెక్స్ రిజర్వులు గడిచిన నెల రోజుల్లోనే 30 బిలియన్ డాలర్ల స్థాయిలో పతనం చెందాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా రూపాయి కరెన్సీ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నది.

మార్చి 27తో ముగిసిన వారాంతానికిగాను విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 6.622 బిలియన్ డాలర్లు తగ్గి 551.072 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్టు సెంట్రల్ బ్యాంక్ తాజాగా వెల్లడించింది. డాలరేతర కరెన్సీలు అయిన యూరో, పౌండ్, యెన్ కరెన్సీలు తీవ్ర ఆటుపోటులకు గురికావడం వల్లనే విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తులు తరిగిపోయాయని సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. అలాగే పసిడి రిజర్వులు మరింత తగ్గాయి. 3.666 బిలియన్ డాలర్లు తగ్గి 113.521 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్టు వెల్లడించింది. అలాగే స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ మాత్రం 17 మిలియన్ డాలర్లు ఎగబాకి 18.649 బిలియన్ డాలర్లకు



చేరుకోగా, ఐఎంఎఫ్ వద్ద నిల్వలు 17 మిలియన్ డాలర్లు తగ్గి 4.816 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో అసలేం జరుగుతోంది?

**ముంబై:** ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నాన్–-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అతాను చక్రవర్తి అనూహ్య రాజీనామా నేపథ్యంలో బ్యాంకు వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు చేయాలంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) కోరింది. 12 కోట్ల మంది కస్టమర్లు, షేర్‌హోల్డర్లు, సాధారణ ప్రజానీకానికి కూడా బ్యాంకుపై భరోసా కల్పించేందుకు ఇది అవసరమని పేర్కొంది. మార్చి 31న రాసిన లేఖను ఏఐబీఈఏ గురువారం మీడియాకు విడుదల చేసింది. దేశీ వ్యవస్థలో కీలకమైన సంస్థగా ఆర్‌బీఐ వర్గీకరించిన బ్యాంకులో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగించేవిగా ఉన్నాయని ఏఐబీఈఏ పేర్కొంది. గవర్నెన్స్ ప్రమాణాలు, నియంత్రణ సంస్థ పర్యవేక్షణ, వ్యవస్థ స్థిరత్వంపై సందేహాలు తలెత్తుతున్నాయని తెలిపింది. ఓ స్వతంత్ర డైరెక్టరు నైతికత అంశాన్ని ప్రస్తావిస్తూ రాజీనామా చేయడం అసాధారణమైన విషయమని, దీనిపై అవసరమైతే సీబీఐ లేదా సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌తో తక్షణం విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని ఏఐబీఈఏ అభిప్రాయపడింది. బ్యాంకులన్నీ ప్రజలకు జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందేనని, పారదర్శకత విషయంలో అత్యున్నత ప్రమాణాలను పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. తమ దుబాయ్ శాఖ ఏటీ–-1 బాండ్లను తప్పుగా విక్రయించిందన్న ఆరోపణలు రావడం, బ్యాంకు పనితీరు సరిగ్గా లేకపోవడంలాంటి అంశాల వల్ల నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లు




అతాను చక్రవర్తి వెల్లడించిన సంగతి తెలిసిందే.

# బీసీసీఐకి ఇదే మా రిక్వెస్ట్..
# లేఖలో ఆ విషయాలు: బంగ్లాదేశ్

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)ని సంప్రదించినట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) తాజాగా ధ్రువీకరించింది. భారత్‌తో క్రికెట్ సంబంధాల పునరుద్ధరణ కోసం తాము ముందడుగు వేసినట్లు తెలిపింది. కాగా గత కొంతకాలంగా భారత్– బంగ్లాదేశ్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతల కారణంగా క్రికెట్ సంబంధాలు కూడా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బంగ్లాదేశ్ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్ రహమాన్‌ను ఐపీఎల్ నుంచి బీసీసీఐ తొలగించగా.. టీ20 ప్రపంచకప్–2026 ఆడేందుకు భారత్‌కు వచ్చేందుకు బంగ్లా నిరాకరించింది. భద్రతా కారణాలు చూపుతూ తమ వేదికను శ్రీలంకను మార్చమని ఐసీసీని కోరగా.. ప్రతికూల నిర్ణయం రావడంతో టోర్నీ నుంచే తప్పుకొంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌కు వంత పాడుతూ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు బీసీసీఐపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు, విమర్శలు చేసింది. ఐసీసీ సైతం బీసీసీఐ ఒత్తిడికి తలొగ్గి బంగ్లాదేశ్‌కు అన్యాయం చేసిందని ఆరోపించింది. ఇందుకు ప్రతిగా తాము భారత్‌తో మ్యాచ్ బహిష్కరిస్తామని ప్రగల్భాలు పలికి బొక్కబోర్లా పడింది.

**భారీగా నష్టపోయే ప్రమాదం**

ఐసీసీ రంగంలోకి దిగడంతో టీమిండియాతో మ్యాచ్ ఆడటమే కాకుండా.. యథావిధిగా మరోసారి ఓటమిని మూటగట్టుకుంది పాకిస్తాన్. ఈ ఎపిసోడ్‌తో బంగ్లాదేశ్ ఆర్థికంగా భారీగా




నష్టపోయే ప్రమాదం వచ్చిపడింది. ఆదేశంలోని మెజారిటీ ప్లేయర్ల క్రికెట్ కిట్లకు స్పాన్సర్లుగా ఉన్న భారత కంపెనీలు వైదొలుగుతాయనే భయం పట్టుకుంది. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ పలువురు మాజీ క్రికెటర్లు బంగ్లా బోర్డును హెచ్చరించారు కూడా!.. ఈ క్రమంలో తాజాగా బీసీబీ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఈ నేపథ్యంలో బీసీబీ క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ నజ్ముల్ అబెదిన్ ఫాహిమ్ ’ాచీ×తో మాట్లాడుతూ కీలక విషయం వెల్లడించాడు.

**బీసీసీఐని సంప్రదించాము**

“వివిధ దేశాల క్రికెట్ బోర్డులతో మేము సమన్వయం చేసుకుంటున్నాము. ఇటీవలే బీసీసీఐని కూడా సంప్రదించాము. ఇ–మెయిల్ ద్వారా లేఖ పంపించాము. అందులో టీమిండియా బంగ్లాదేశ్ పర్యటన గురించి ప్రస్తావించాము. ఈ ఏడాది సెప్టెంబరులో టీమిండియా బంగ్లాదేశ్‌లో పర్యటించాల్సిన విషయాన్ని గుర్తుచేశాము. అదే విధంగా మా మహిళా జట్టు భారత్‌లో పర్యటించాల్సి ఉంది. దీనితో పాటు పరస్పర ప్రయోజనాలు చేకూరేలా క్రికెట్‌కు సంబంధించి ఇతర కార్యక్రమాలు ఏమైనా నిర్వహించవచ్చున్న విషయాన్ని కూడా పరిశీలించాలని అభ్యర్థించాము” అని నజ్ముల్ తెలిపాడు.

**మూడు వన్డేలు, మూడు టీ20లు!**

కాగా బంగ్లాదేశ్ కొత్త ప్రధానిగా తారిక్ రహమాన్ ఎన్నికైన తర్వాత భారత్– బంగ్లా సంబంధాలు మెరుగుపడుతున్నాయి. ఏప్రిల్ 7,8 తేదీల్లో బంగ్లాదేశ్ విదేశాంగ శాఖా మంత్రి డాక్టర్ ఖాలిలుర్ రహమాన్ భారత పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో క్రికెట్‌లోనూ సంబంధాల పునరుద్ధరణ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది బంగ్లా బోర్డు. ఇదిలా ఉంటే గతేడాది ఆగస్టులో టీమిండియా బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లాల్సి ఉండగా.. టూర్ వాయిదా పడింది. ఈ క్రమంలో ఈ ఏడాది సెప్టెంబరు 1– 13 మధ్య బంగ్లాదేశ్‌తో భారత్ మూడు వన్డే, మూడు టీ20లు ఆడేలా షెడ్యూల్ ఖరారు కావాలని బీసీబీ కోరుకుంటోంది.

## స్పోర్ట్స్

### రాహుల్ మరోసారి..!




ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ ఆటగాడు కేఎల్ రాహుల్ ప్రస్తుత ఐపీఎల్ ఎడిషన్‌లో తన వైఫల్యాల పరంపరను కొనసాగిస్తున్నాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో గోల్డెన్ డకౌటైన ఇతను.. ముంబై ఇండియన్స్‌తో ఇవాల్టి (ఏప్రిల్ 4) మ్యాచ్‌లో ఖాతా తెరిచిన వెంటనే ఇన్నింగ్స్‌ను ముగించాడు. రాహుల్ వరుస వైఫల్యాల నేపథ్యంలో ఢిల్లీ క్యాపిటల్స్‌లో ఆందోళన మొదలైంది. ఆ జట్టు ఫ్యాన్స్ రాహుల్‌ను బహిరంగంగా టార్గెట్ చేస్తున్నారు. జట్టులో అందరి కంటే సీనియర్‌వి.. మిగతా ఆటగాళ్లను ఆదర్శంగా ఉండాలంటూ చురకలంటిస్తున్నారు. మరోపక్క టీమిండియా సీనియర్లతో కంపేర్ చేస్తూ నిందిస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌ల్లో టీమిండియా సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్ రాణించారు. రాహుల్ మాత్రమే ఎందుకు విఫలమవుతున్నాడని ఫీలవుతున్నారు. ఇదిలా ఉంటే, రాహుల్ విఫలమైన ?తొలి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ గట్టెక్కిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో లక్నో నిర్దేశించిన 142 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో రాహుల్ సహా నిస్సంక, నితీశ్ రాణా, అక్షర్ పటేల్ విఫలమైనా, సమీర్ రిజ్వి (70 నాటౌట్) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి ఢిల్లీని గెలిపించాడు. అతనికి ట్రిస్టన్ స్టబ్స్ (39 నాటౌట్) సహకరించాడు. ముంబై ఇండియన్స్‌తో నేటి మ్యాచ్ విషయానికొస్తే.. ఈ మ్యాచ్‌లోనూ ఢిల్లీ స్వల్ప లక్ష్య ఛేదనలో తడబడుతుంది. 7 పరుగులకే రాహుల్, నితీశ్ రాణా (0) వికెట్లు కోల్పోయి ఎదురీదుతుంది. నిస్సంక (39), సమీర్ రిజ్వి (7) ఢిల్లీని గెలిపించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఢిల్లీ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేసి ముంబై బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. ముకేశ్ కుమార్ 2, ఎంగిడి, అక్షర్ పటేల్, విప్రాజ్ నిగమ్, నటరాజన్ తలో వికెట్ తీశారు. కుల్దీప్ యాదవ్ (3-0-31-0) మినహా ఢిల్లీ బౌలర్లంతా పొదుపుగా కూడా బౌలింగ్ చేశారు. ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్‌లో తాత్కాలిక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (51) అర్ధ సెంచరీతో రాణించగా.. రోహిత్ శర్మ (35) ఓ మోస్తరు స్కోర్‌తో పర్వాలేదనిపించాడు.

### ఆస్ట్రేలియా వెళ్లిపోయిన ఎస్‌ఆర్‌హెచ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్.. మళ్లీ తిరిగి జట్టులోకి వస్తాడా..?

సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్టు ఫుల్‌టైమ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తన స్వదేశమైన ఆస్ట్రేలియా తిరిగి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అయితే, ఆయన త్వరలోనే తిరిగి వస్తారని ఎస్‌ఆర్‌హెచ్ వర్గాలు తెలిపాయి. ఆస్ట్రేలియా కెప్టెన్ అయిన ప్యాట్ కమిన్స్ ఐపీఎల్‌లో ఎస్‌ఆర్‌హెచ్ టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఆయన కొంతకాలంగా వెన్నునొప్పి సమస్యతో బాధపడుతున్నారు. ఈ కారణంగానే ఇటీవల ఆస్ట్రేలియా ఆడిన టీ20 వరల్డ్ కప్ సహా అంతర్జాతీయ మ్యాచులకు దూరమయ్యాడు. ఇప్పుడు ఐపీఎల్‌లో కూడా కొన్ని మ్యాచులకు దూరం కానున్నాడు. ఇప్పటికే మొదటి రెండు మ్యాచుల్లో ఆడలేదు. అతడికి సమస్య ఉన్నప్పటికీ, ఇప్పటిదాకా ఎస్‌ఆర్‌హెచ్ జట్టుతోనే ఉన్నాడు. టోర్నీ ప్రారంభానికి ముందే జట్టుతో చేరాడు. నెట్స్‌లో ప్రాక్టీస్ కూడా చేస్తున్నాడు. అయితే, తాజాగా అతడు ఆస్ట్రేలియా తిరిగి వెళ్లినట్లు తెలుస్తోంది. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) నిబంధనల మేరకు కమిన్స్ ఆ దేశం తిరిగి వెళ్లాడు. అతడు ఏ టోర్నీలో ఆడాలన్నా సీఏ అనుమతి తప్పనిసరి.



ఇందుకోసం అతడు ఫిట్‌నెస్ నిరూపించుకోవాలి. దీనికోసం అక్కడ వైద్య పరీక్షలకు హాజరవ్వాలి. ఈ నేపథ్యంలో వెన్నునొప్పితో బాధపడుతున్న కమిన్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఆస్ట్రేలియా వెళ్లిన కమిన్స్ అక్కడ సీఏ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేయించుకుంటారు. కమిన్స్ పూర్తిగా కోలుకున్నట్లు భావిస్తే ఐపీఎల్‌లో ఆడేందుకు సీఏ అనుమతిస్తుంది. ప్రస్తుతం కమిన్స్ కోలుకున్నట్లు తెలుస్తోంది. అక్కడ పరీక్షల అనంతరం సీఏ అనుమతితో ఐపీఎల్‌లో ఆడుతాడు. ఏప్రిల్ 17న కమిన్స్ తిరిగి ఎస్‌ఆర్‌హెచ్ జట్టుతో చేరుతాడు. ఆ తర్వాత జరిగే మ్యాచులకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. సీఏ అనుమతి లేకుండా, అనారోగ్యంతో ఉన్నప్పుడు ఇతర టోర్నీల్లో ఆడితే అతడిపై సొంత జట్టైన సీఏ చర్యలు తీసుకుంటుంది. అందుకోసమే అక్కడికి వెళ్లి తగిన అనుమతులతో కమిన్స్ ఐపీఎల్‌లో అడుగుపెడతాడు. ఎస్‌ఆర్‌హెచ్.. తాజా ఐపీఎల్‌లో రెండు మ్యాచులు ఆడింది. ఒక దానిలో విజయం సాధించింది. మిగతా మూడు మ్యాచులకు కమిన్స్ దూరంగా ఉంటాడు. ఆ తర్వాతి మ్యాచులకు అందుబాటులోకి వస్తాడు.



## దుమ్మురేపిన 'రాకాస' ఫస్ట్ డే కలెక్షన్స్
## సంగీత్ శోభన్ హారర్ కామెడీకి పాజిటివ్ టాక్

యంగ్ హీరో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ రాకాస థియేటర్లలో మంచి స్పందనను అందుకుంటోంది. విడుదలైన మొదటి రోజే పాజిటివ్ టాక్ సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ నమోదు చేసింది. ప్రీమియర్స్‌తో కలిపి 'రాకాస' చిత్రం వరల్డ్‌వైడ్‌గా సుమారు రూ.5.6 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఇండియాలో మాత్రమే రూ.2.60 కోట్ల నెట్ కలెక్షన్స్ నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. తొలి రోజు థియేటర్లలో 36 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. వీకెండ్ కావడంతో ఈ సినిమా కలెక్షన్స్ మరింత పెరిగే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. సినిమాకు వస్తున్న స్పందనపై నిర్మాత నిహారిక కొణిదెల ఆనందం వ్యక్తం చేశారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ మూవీని ఎంజాయ్ చేస్తున్నారు. ఓవర్సీస్‌లో కూడా మంచి రెస్పాన్స్ వస్తోంది అని తెలిపారు. ఇటీవల మూవీ టీం సక్సెస్ మీట్ నిర్వహించి విజయోత్సవాలు జరుపుకుంది. ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించారు. ప్రధాన పాత్రల్లో సంగీత్ శోభన్, నయన్ సారికతో పాటు గెటప్ శ్రీను, వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి, అన్నపూర్ణ తదితరులు కీలక పాత్రలు పోషించారు. జీ స్టూడియోస్ సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. గ్రామంలో ఉన్న ఓ పాడుబడిన కోటలో వందల ఏళ్లకు ఒకసారి మేల్కొనే రాక్షసుడు కథకు కేంద్రబిందువుగా ఉంటుంది. గ్రామస్తులు నమ్మే ఆచారం ప్రకారం... ఆ రాక్షసుడికి బలి ఇస్తే గ్రామం క్షేమంగా ఉంటుందని విశ్వసిస్తారు. ఈ క్రమంలో హీరో వీరు (సంగీత్ శోభన్)ను కోటలోకి పంపే పరిస్థితి వస్తుంది. అతను ఆ ప్రమాదం నుంచి ఎలా బయటపడతాడు? అతని స్నేహితులు ఎలా సహాయపడతారు? అన్నది కథలో ఆసక్తికరంగా మలిచారు. రాకాస చిత్రం హారర్ -- కామెడీ మిశ్రమంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఫస్ట్ డే నుంచే మంచి వసూళ్లు సాధించిన ఈ సినిమా... వీకెండ్‌లో మరింత జోరు చూపించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



## మృణాల్, అడివిశేష్‌లకు సంకెళ్లు, పోలీస్ వ్యాన్‌లో ఎంట్రీ.. 'డెకాయిట్' వినూత్న ప్రమోషన్స్!

టాలెంటెడ్ హీరో అడివి శేష్, బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన క్రేజీ ప్రాజెక్ట్ 'డెకాయిట్' ఈ సినిమా ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్స్ స్పీడ్ పెంచింది. తాజాగా ముంబైలో జరిగిన ఈ సినిమా హిందీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో చిత్రబృందం చేసిన ఒక వినూత్న ప్రయోగం ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

సాధారణంగా సినిమా ఈవెంట్లకు హీరో హీరోయిన్లు ఎంతో స్టైలిష్‌గా కార్లలో దిగుతారు. కానీ, 'డెకాయిట్' టీమ్ మాత్రం ట్రెండ్‌కు భిన్నంగా ప్లాన్ చేసింది. ఈ ఈవెంట్‌కు హీరోయిన్ మృణాల్ ఠాకూర్‌తో పాటు హీరో అడివి శేష్‌లను ఒక పోలీస్ వ్యాన్‌లో, చేతులకు సంకెళ్లు (ఝుఅఎఎషబటటం) వేసి తీసుకువచ్చారు. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో పోలీస్ పాత్రలో నటిస్తుండగా అతడే మృణాల్‌ని సంకెళ్లతో వ్యాన్ దింపి ఈవెంట్ వేదికపైకి నడిపించుకుంటూ తీసుకువెళ్లారు. మొదట ఇది చూసిన మీడియా ప్రతినిధులు, అభిమానులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అయితే సినిమా కథాంశం నేర ప్రపంచం, రివెంజ్ డ్రామా చుట్టూ తిరుగుతుండటంతో.. మూవీ థీమ్‌కు తగ్గట్టుగానే ఈ వెరైటీ పబ్లిసిటీ స్టంట్‌ను ప్లాన్ చేశారని తెలిసి అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# హీరో నుంచి డైరెక్టర్‌గా కిరణ్ అబ్బవరం కొత్త ప్రయాణం...
## 'రియాలిటీ'తో ట్రిపుల్ రోల్‌కు రెడీ!



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ప్రస్తుతం కెరీర్‌లో గోల్డెన్ ఫేజ్‌ను ఆస్వాదిస్తున్నారు. వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద తన స్థాయిని పెంచుకున్న ఈ హీరో... ఇప్పుడు షాకింగ్ నిర్ణయం తీసుకుని అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఇటీవల 'క', 'కె-ర్యాంప్' సినిమాలతో మంచి విజయాలు అందుకున్న కిరణ్ అబ్బవరం... తన మార్కెట్‌ను గణనీయంగా పెంచుకున్నారు. ఈ విజయాల తర్వాత నిర్మాతలు ఆయనకు రూ.10 కోట్ల వరకు రెమ్యునరేషన్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నారని టాక్ వినిపిస్తోంది. అయితే ఇలాంటి భారీ ఆఫర్లను పక్కనబెట్టి... తనలోని దర్శకుడిని బయటకు తీసుకురావాలని కిరణ్ నిర్ణయించుకోవడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం జనరేషన్‌కు తగ్గ కథతో 'రియాలిటీ' అనే ప్రాజెక్ట్‌ను సిద్ధం చేసుకున్న కిరణ్ అబ్బవరం... ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కానున్నారు. గతంలో షార్ట్ ఫిలిమ్స్ చేసిన అనుభవంతో ఇప్పుడు ఫుల్ లెంగ్త్ మూవీకి రెడీ అయ్యారు. ఈ సినిమా మే 2026లో షూటింగ్ ప్రారంభం కానుండగా... దీపావళి కానుకగా నవంబర్‌లో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. కేవలం నటుడిగానే కాదు... నిర్మాతగా కూడా కిరణ్ ఫుల్ బిజీగా ఉన్నారు. తన సొంత బ్యానర్‌లో నిర్మిస్తున్న 'తిమ్మరాజుపల్లె టీవీ' సినిమా ఏప్రిల్ 17న విడుదలకు సిద్ధంగా ఉంది. ఇక వెండితెరతో పాటు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లపై కూడా తన ముద్ర వేసేందుకు కిరణ్ ప్రయత్నిస్తున్నారు. ప్రముఖ అమెజాన్ ప్రైమ్ వీడియో కోసం రూపొందుతున్న వెబ్ సిరీస్ ద్వారా ఓటీటీ రంగంలోకి అడుగుపెడుతున్నారు. 'రియాలిటీ' సినిమాతో కిరణ్ అబ్బవరం ఒకేసారి నటుడు, దర్శకుడు, నిర్మాతగా మూడు బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నిర్ణయం ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా మారే అవకాశం ఉంది. మొత్తానికి, కిరణ్ అబ్బవరం తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయం టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్‌కు నాంది పలికే అవకాశం ఉంది. 'రియాలిటీ' సినిమాతో ఆయన దర్శకుడిగా కూడా విజయాన్ని అందుకుంటారా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



## రామాయణలో మరో పవర్‌ఫుల్ పాత్రలో రణ్‌బీర్

భారతీయ ఇతిహాసం 'రామాయణం' ఆధారంగా చాలా సినిమాలు ఇప్పటికే అలరించాయి. ఈ క్రమంలో హిందీలో 'రామాయణ' చిత్రాన్ని నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, లక్ష్మణుడిగా రవి దుబే, హనుమంతుడిగా సన్నీ డియోల్, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. అయితే, ఇటీవల ఈ మూవీ నుంచి విడుదలైన టీజర్ ప్రేక్షకులను మెప్పిస్తుంది. తాజాగా ఈ మూవీ గురించి రణ్‌బీర్ ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ఇందులో తను ద్విపాత్రాభినయం చేసినట్లు పేర్కొన్నారు. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డీఎన్‌ఈజీ సంస్థ, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకాలపై భారీ బడ్జెట్‌తో నమిత్ మల్హోత్రా ఈ సినిమాను రెండు భాగాలుగా నిర్మిస్తున్నారు. ఒక వేదికపై రణ్‌బీర్ మాట్లాడుతూ రామాయణ చిత్రంలో శ్రీరాముడి పాత్రతో పాటు పరశురాముడిగా కూడా నటిస్తున్నట్లు ప్రకటించారు. శ్రీ మహావిష్ణువు ఆరో అవతారం పరశురాముడిగా కూడా నటించే ఛాన్స్ తనకు రావడం నిజంగానే అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఒక నటుడిగా, హావభావాలతో పాటు ఆ పాత్రల వెనుక దాగిన ఆధ్యాత్మికతను, భావోద్వేగాలను లోతుగా అర్థం చేసుకున్నానని తెలిపారు. రామాయణం గురించి పూర్తిగా తెలుసుకునేందుకు సుమారు ఏడాది పాటు సమయం కేటాయించానని ఆయన అన్నారు.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463